Follow: @ANNTELUGU

07-07-2026

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 183 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇంట్లో బంగారంపై కేంద్రం కన్ను

**ఇకపై గోల్డ్ షాపుల్లోనే దాచుకొనే స్కీం రాబోతుందా?**

**ఢిల్లీ, మహా :** ఇళ్లల్లో నిరుపయోగంగా పడి ఉన్న బంగారాన్ని దేశీయ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఒక సరికొత్త వ్యూహాన్ని రచిస్తోంది. ప్రతిష్టాత్మకమైన 'గోల్డ్ మోనిటైజేషన్ స్కీమ్' లో కీలక మార్పులు చేస్తూ, దేశంలోనే మొదటిసారిగా స్థానిక బంగారు వ్యాపారులను ఈ పథకంలో భాగస్వాములుగా చేర్చాలని భావిస్తోంది. బ్యాంకులతో పోలిస్తే సామాన్య ప్రజలకు జ్యువెలర్లతోనే ఎక్కువ పరిచయం, నమ్మకం ఉంటాయి కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ పథకానికి కేవలం ప్రక్రియే అడ్డంకి కాదు, ప్రజల్లో ఉన్న 'ప్రభుత్వ పన్నుల భయమే' అసలైన

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## రేవంత్ సర్కార్ రికార్డు



- రెండేళ్ళలో 23వేల కోట్ల రైతు భరోసా పంపిణీ

02

## అసెంబ్లీ సెలెక్ట్ కమిటీ ఛైర్మన్ గా మంత్రి పొన్నం



- జాయింట్ కమిటీ ఛైర్మన్ గా కడియం

02

## నీరవ్ మోదీకి షాక్ భారత్‌కు అప్పగింత



- యూరోపియన్ కోర్టులో అప్పీల్ తిరస్కరణ
- భారత్‌కు అప్పగింతకు మార్గం సుగమం
- సీబీఐ, ఈడీకి భారీ ఊరట

02

అంతర్జాతీయ

## టూరిజం హబ్‌గా తెలంగాణ

- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- వికారాబాద్ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన





**హైదరాబాద్, మహా :** తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ లోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తారామతి బారామతిని టూరిజం ప్లేస్‌గా మరింత గా అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును మిగతా 2వ పేజీలో



## బిల్డర్ల అరాచకం

**ఆక్రమించిన స్థలం రూ. 100కోట్ల పై మాటే**

### ప్రభుత్వ భూమి దురాక్రమణ

శేరిలింగంపల్లి మండలం , ఖానామెట్ పరిధిలో బిల్డర్ల అరాచకం పరాకాష్టకు చేరింది. ఐటీ హబ్ హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కులు చెరబట్టారు. సర్వే నంబర్లు 11/33, 11/34 లలో 4 వేల చదరపు గజాల భూమి గల్లంతయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు . మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి సుమారు రూ. 100 కోట్లకు పై మాటే ఉంటుందని బహిరంగ చర్చ జరుగుతోంది. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల పై అక్రమార్కుల కన్ను పడటం తో అదే అదునుగా భావించి అధికారులతో కుమ్మక్కై దురాక్రమణకు తెగబడుతున్నారు. చట్టాలు, కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ అక్కడ భారీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని రాకెట్ వేగంతో చేపట్టడం తీవ్ర కలకలం రేపుతోంది.ఇంత బహిరంగంగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా.. సంబంధిత టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున "ముడుపుల ముట్టాయనే" ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

02

- సర్వే నెంబర్లు 11/33,11/34 గల్లంతు
- 4వేల చదరపు గజాల భూమి గోల్ మాల్
- 22(ఏ)లో యథేచ్ఛగా
- కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు
- కోర్టు పరిధిలో ఉన్నా లెక్కచేయని అక్రమార్కులు
- రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల అండ..
- అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు వెల్లువ
- మహా కథనానికి అక్రమార్కుల గుండెల్లో గుబులు.

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కొత్త మలుపు



- పాప కనపడకుండా పోయిన రోజున కనిపించిన కియా కారు మళ్లీ ప్రత్యక్షం
- అదే కారు తమ బంధువును ఢీకొట్టిందని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నెలరోజులుగా లభించని ఆచూకీ

02



## ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్

**బెంగళూరు, చెన్నై వెనక్కి**

- దక్షిణాదిలో రూ.11,246 కోట్లకు చేరిన లగ్జరీ గృహాల విక్రయాలు
- ఈ అమ్మకాలలో రూ.8,562 కోట్లతో హైదరాబాద్ అగ్రస్థానం

02



## భారత్‌కు జపాన్ టెక్నాలజీ..

- నౌకా దళానికి కొత్త బలం
- స్టెల్త్ సామర్థ్యం పెంచే ఇంటిగ్రేటెడ్ మాస్ట్
- భారత్-జపాన్ రక్షణ సహకారంలో కీలక అడుగు

08

## మణుగూరులో అత్యాధునిక పోలీస్ స్టేషన్ ప్రారంభం

- మాదకద్రవ్యాల నిర్మూలనపై ఉక్కుపాదం
- డీజీపీ సీవీ ఆనంద్

02





మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | మంగళవారం, హైదరాబాద్ | 07-07-2026
ANN తెలుగు

# బిల్డర్ల అరాచకం













**స్పెషల్ టాస్క్ ఫోర్స్**
**హైదరాబాద్ మహా :**

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం కూకట్పల్లి జోనల్ పరిధి ఖానామెట్ లో బిల్డర్ల అరాచకం రాజ్యమే లుతుంది.సర్వే నెంబర్లు 11/33, 11/34 లలో ఉన్న సుమారు 4 వేల చదరపు గజాల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమార్కులు దురాక్రమణకు తెగబడ్డారు . ఈ వివాదాస్పద భూమి అత్యంత కీలక మైన 22(A) (రిజిస్ట్రేషన్ నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉంది. అంతేకాకుండా, ఈ స్థలానికి సంబంధించి కోర్టు పరిధిలో స్పష్టమైన వివాదం నడుస్తోంది. చట్టప్రకారం ఇక్కడ ఎలాంటి కొనుగోళ్లు, అమ్మకాలు, ఎలాంటి నిర్మాణ పనులుగానీ చేపట్టడానికి వీల్లేదు. కానీ, కోర్టు ఆదేశాలను, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమార్కులు ఇక్కడ రాత్రికి రాత్రే బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాల నిర్మాణాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. భారీ కాంక్రీట్ మిక్సర్లు, వందలాది మంది కార్మికులతో పనులు ఇక్కడ శరవేగంగా సాగిస్తున్నారు.

**రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల అండ!**

హైటెక్ సిటీ నుంచి కూకట్పల్లి ప్రధాన రహదారి పక్కన బుట్టా కన్వెన్షన్ ఆనుకుని వందల కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం అక్రమార్కుల పాలయింది. ఇంత బహిరంగంగా కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆస్తి దరాక్రమణకు గురి అవుతుంటే అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పత్తాలేకుండా పోయారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవ డం వెనుక ఉన్న 'అంతరార్థం' ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ఒక సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా వంద నిబంధనలు పెట్టి వేధించే టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, ఈ భారీ అక్రమ కట్టడాల వైపు ఎందుకు చూడటం లేదన్నది బహిరంగ రహస్యమే అని స్థానికులు పేర్కొంటున్నారు . అధికా రుల పూర్తి అండదండలు, ముడుపుల మౌనం వల్లే ఈ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని స్థానికులు మం డిపడుతున్నారు.

## 'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ..

ఈ అక్రమ కట్టడాలపై సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆంజనేయులు, భాస్కర్ సారథ్యంలో స్థానికులతో కలిసి రెవెన్యూ అధికారులకు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కి ఫిర్యాదులు చేసారు. అధికారిక రికార్డులు, ఫోటోలు, క్షేత్రస్థాయి ఆధారాలతో సహా వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయి అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై తక్ష ణమే విచారణకు ఆదేశాలు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుండటంతో
ఇన్నాళ్లూ అధికారుల అండతో రెచ్చిపోయిన కబ్జా దారులకు, ఇప్పుడు ఈ వ్యవహారం ప్రజావాణి వేదికగా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం.. దానికి తోడు 'మహా కథనం' రూపంలో వారి అక్రమాల పుట్ట బద్దలు కావడంతో వారి గుండెల్లో వణుకు మొదలైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు లంచగొండి అధికారులపై, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అక్రమ నిర్మాణదా రుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని శేరిలింగంపల్లి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.









# అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ

**( మొదటి పేజీ తరువాయి )**

పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధి కారులను సీఎం ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకరించాలన్నారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభి వృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయయడంతో ఈ ఆలయాని కి యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పర్యావరణహిత పర్యాటకానికి ప్రా ధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అం తర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. పా తబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చా లని అధికారులకు తెలిపారు.



# ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్

**హైదరాబాద్, మహా :** దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన నగరాల్లో అల్ట్రాలగ్జరీ గృహాల మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. 202526 ఆర్థిక సంవ త్సరంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన 811 వి లాసవంతమైన ఇళ్లు అమ్ముడయ్యాయి. వీటి మొత్తం అమ్మకాల విలువ రూ.11,246 కోట్లుగా నమోదైంది. ఈ వివరాలను 'సదరన్ ఇండియా హైఎండ్ లగ్జరీ హౌసింగ్' పేరుతో ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ విక్రయాల్లో హైద రాబాద్ నగరం స్పష్టమైన ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క హైదరాబాద్‌లోనే 625 లగ్జరీ ఇళ్లు అమ్ముడుపోగా, వాటి విలువ రూ.8,562 కోట్లుగా ఉంది. హైదరాబాద్ తర్వాత బెంగళూరులో 128 ఇళ్ల అమ్మకాల ద్వారా రూ.1,957 కోట్లు, చెన్నైలో 58 ఇళ్ల విక్రయాల ద్వారా రూ.727 కోట్ల వ్యాపారం జరిగింది. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో తక్కువ ధరకే ఎక్కువ స్థలం లభించడం ఈ వృద్ధికి కీలక కారణంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.10 కోట్లతో హైదరా బాద్‌లో సుమారు 6,210 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కొనుగోలు చేయగలిగితే, అదే మొత్తానికి చెన్నైలో 4,290 చదరపు అడుగులు, బెంగళూరులో కేవలం 3,930 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తోంది. హైదరాబాద్‌లోని కోకాపేట, బెంగళూరులోని రాజ నుకుంటె ప్రాంతాలు అల్ట్రాప్రీమియం ప్రాజెక్టులకు హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. ఈ నివేదికపై ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ సీఈఓ అశ్విన్ చద్దా మాట్లాడుతూ, "దక్షిణ భారతదేశంలోని లగ్జరీ గృహాల మార్కెట్ మూడు విభిన్న నగరాల ప్రత్యేకతలతో రూపు దిద్దుకుంటోంది. అమ్మకాల పరిమాణంలో హైదరాబా ద్ అగ్రగామిగా నిలుస్తుండగా, బెంగళూరు వేగవంత మైన వృద్ధి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. మరోవైపు చెన్నై తన పాత, ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ప్రాంతాలపై ఆధారపడి స్థిరంగా కొనసాగుతోంది," అని వివరిం చారు.

# చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కొత్త మలుపు



**కాకినాడ, మహా :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారంలో తీవ్ర కలకలం రేపిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు కొత్త మలుపు తిరిగింది. దాదాపు నెల రోజులుగా ఆచూకీ లేకుండా పోయిన ఈ కేసులో, తాజాగా ఓ అనుమానాస్పద కారుపై పోలీసుల దృష్టి పడింది. ఈ పరిణామంతో దర్యాప్తు మరో కోణంలో వేగవంతమైంది. వివరాల్లోకి వెళితే, సుంకర గణేశ్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానే శ్వరి (2) జూన్ 6న వారు పనిచేస్తున్న పామాయిల్ తోటలో ఆడుకుంటూ అదృశ్యమైంది. అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నా చిన్నారి జాడ తెలియరాలేదు. అయితే, పాప అదృశ్యమైన రోజున ఓ కియా కారు అనుమానాస్పదంగా సంచరించినట్లు స్థానికులు గు ర్తించారు. ఇప్పుడు గత రెండు రోజులుగా అదే కారు మళ్లీ ఆ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
నర్సీపట్నం సమీపంలో తమ బంధువుల్లో ఒకరిని అదే కారు ఢీకొట్టిందని కుటుంబ సభ్యులు ఆరోపి స్తున్నారు. దీంతో అనుమానాలు మరింత బలపడ్డా యి. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు, ఈ కొత్త కోణంపై లోతుగా దర్యాప్తు ప్రా రంభించారు. అనుమానిత కారు వివరాలు, దాని కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

## తెలంగాణ సచివాలయంలో నిలిచిపోయిన క్యాటరింగ్ సేవలు

**హైదరాబాద్, మహా :**
తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఉండే ఫ్లోర్ కు క్యా టరింగ్ సేవలు నిలిచిపోయాయి. గత రెండే ళ్లుగా కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన సరఫరాను నిలిపివేశారు. ఈ పరిణామంతో సచివాల యంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివా లయంలోని ఆరో అంతస్తులో ఉండే ముఖ్య మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కార్యాలయాల సిబ్బందితో పాటు ఇతర ఉన్నతాధికారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఫలహారాలు అందించే సేవలకు అంతరాయం ఏర్పడింది. పేరుకుపోయిన బకాయిలను కనీసం వాయిదాల పద్ధతిలో నైనా విడుదల చేయాలని కాంట్రాక్టర్ పలు మార్లు విన్నవించినప్పటికీ, అధికారులు స్పందించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ బకాయిలు కోట్ల రూపాయల్లో ఉండటంతో ముడిసరు కులు కొనుగోలు, సిబ్బంది జీతాల చెల్లింపు భారంగా మారి కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు సమాచారం. రాష్ట్రంలో వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆందోళనల నడుమ ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి వి క్రమార్క వంటి సీనియర్ నేతల హామీతో కాంట్రాక్టర్లు తమ నిరసనలను వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికే ఆహార సరఫరా నిలిచిపోవడం గమనార్హం.



# ఇంట్లో బంగారంపై కేంద్రం కన్ను

**( మొదటి పేజీ తరువాయి )**

సమస్య అని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. బంగారం డిపాజిట్ చేస్తే ఎక్కడ ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కన్ను పడుతుందో, తమ సంపాదనపై ఎక్కడ పన్ను ప్రశ్నలు అడుగుతుందో అనే ఆందోళనలు చాలా మందిలో ఉన్నాయి. దీనివల్ల ఈ రకమైన సంస్కర ణలు కూడా ఆశించిన మేర ఫలితాన్ని ఇవ్వడం కష్ట మేనని ఆర్థిక శాఖ వర్గాలు అంగీకరిస్తున్నాయి. గోల్డ్ మోనిటైజేషన్ స్కీమ్ కింద ప్రజలు తమ వద్ద ఉన్న బం గారాన్ని బ్యాంకులలో డిపాజిట్ చేసి, సురక్షితంగా వడ్డీని సంపాదించవచ్చు. కానీ, 2015 లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి నవంబర్ 2025 నాటికి కేవలం 39 టన్నుల బంగారం మాత్రమే మార్కెట్లోకి వచ్చింది. నిజానికి మన దేశంలోని ఇళ్లల్లో సుమారు 25,000 నుంచి 30,000 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా. ఈ అపారమైన నిల్వ లతో పోలిస్తే పథకం సాధించిన విజయం చాలా స్వ ల్పమని అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. స్థానిక గోల్డ్ షోరూమ్‌లకు ఈ డిపాజిట్లను సేకరించే అధికారం ఇవ్వడం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతా ల్లో పథకం మరింత వేగంగా దూసుకుపోతుందని అధికారులు విశ్వసిస్తున్నారు. సౌకర్యవంతమైన కొత్త మార్పులు తీసుకురావడం ద్వారా నిరుపయో గంగా ఉన్న బంగారాన్ని బయటకు తీసేందుకు జ్యువెలర్లను భాగస్వాములను చేయడం మంచి పరి ణామమే. అయితే, కేవలం సదుపాయాలు పెంచితే సరిపోదు; ఐటీ తనిఖీల భయం నుంచి డిపాజిటర్లకు పూర్తి క్లీన్ చిట్ లేదా ఒక నిర్దిష్టమైన రక్షణ కల్పించే విధానాన్ని తీసుకురావాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



## నీరవ్ మోదీకి షాక్ భారత్‌కు అప్పగింత

**ఢిల్లీ,మహా :** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని కటకటాల్లోకి నెట్టేందుకు భారత ప్రభుత్వానికి భారీ విజయం దక్కింది. బ్రిటన్ నుంచి తనను భారతదేశానికి అప్ప గించడాన్ని సవాల్ చేస్తూ ఆయన పెట్టుకు న్న చివరి ఆశల దరఖాస్తు కూడా తిరస్కర ణకు గురైంది. ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే అత్యున్నత సంస్థ 'యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' నీరవ్ మోదీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. దీంతో ఆయనకు అంతర్జాతీయంగా ఉన్న అన్ని న్యాయపరమైన రక్షణ దారులు పూర్తిగా మూసుకుపోయాయి. తాజా పరిణామంతో నీరవ్ మోదీని లండ న్‌లోని వాండ్స్‌వర్త్ జైలు నుండి భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ , ఈడీ లకు ఉన్న అన్ని అడ్డంకులు తొ లగిపోయాయి. లండన్ హోం శాఖ అధికారిక ఉత్తర్వుల అనంతరం త్వరలోనే ఆయనను ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలుకు తరలించే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేస్తు న్నాయి.

## అసెంబ్లీ సెలెక్ట్ కమిటీ చైర్మన్ గా మంత్రి పొన్నం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేసింది. సెలెక్ట్ కమిటీ చైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాక ర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉండనున్నా రు. జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి చై ర్మన్‌గా ఎంపికయ్యారు. 11 మంది సభ్యులు, చైర్మన్‌తో జాయింట్ కమిటీ పనిచేయనుంది. ఎస్సీ సంక్షేమం కమిటీ చైర్మన్‌గా మేడిపల్లి సత్యంను ఎంపిక చేశారు. 11 మందితో కూడిన సభ్యుల బృందం ఈ కమిటీ విధుల్లో పాలుపంచుకోనుంది.

## రేవంత్ సర్కార్ రికార్డు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రా ష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు అండదండగా ఉండడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతుంది. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం పంట పెట్టుబడిసాయం అందించే రైతు భరోసా విషయంలో సరికొత్త మైలురా యిని అధిగమించింది. గత బీ ఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వంలో రైతుబంధు గా ప్రారంభమైన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం రైతు భరోసాగా కొనసాగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పరిధిని మరింత విస్తృతం చేయడంతో కౌలు రైతులను, వ్యవసాయ కూలీలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడంతో ప్రస్తుతం ఈ పథకంలో లబ్ధిదారుల సంఖ్య 73లక్షల మార్కును చేరుకుంది. గతంలో బీఆర్ఎ స్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లకాలంలో 50,250 కోట్ల రూపాయలు పంపిణీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్ప టివరకు తక్కువ కాలంలోనే 23,070 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు విడుదల చేసింది. ఇందులో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 9 లక్షల మంది నిరుపేద వ్యవసాయ కూలీలను సైతం చేర్చి వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు కూడా లబ్ధి చేకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పైన ఈ పథకానికి సం బంధించిన ఆర్థిక భారం పెరిగినప్పటికీ రైతు సంక్షేమం కోసం ఈ చర్య తీసుకు న్నట్టు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా నల్గొండ జిల్లాకు 5, 491 కోట్లు గరిష్ట నిధులు అందాయి.





# అసెంబ్లీలో 11 కమిటీల నియామకం

**ఎస్టీ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ గా పాయం వెంకటేశ్వర్లు**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేసింది. సెలెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉండనున్నారు. జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. అసెంబ్లీ నిర్వహణకు వివిధ కమిటీలన్నీ నియమించారు.

| ఉమ్మడి కమిటీలు |
| --- |
| సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ - కడియం శ్రీహరి |
| అమెనిటీస్ కమిటీ - సభాపతి, |
| తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ - మేడిపల్లి సత్యం |
| షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ - పాయం వెంకటేశ్వర్లు |
| వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ - మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ |
| గ్రంథాలయ కమిటీ - డా. మట్టా రాగమయి |
| మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ కమిటీ - శ్రీమతి చిట్టెం పర్ణికా రెడ్డి |
| మైనారిటీల సంక్షేమ కమిటీ - లక్ష్మీకాంతరావు తోట |
| వన్యప్రాణులు మరియు పర్యావరణ పరిరక్షణ కమిటీ - సభాపతి, తెలంగాణ శాసనసభ |
| **శాసనసభ కమిటీలు** |
| పిటిషన్స్ కమిటీ - ఉప సభాపతి, తెలంగాణ శాసనసభ |
| ప్రివిలేజెస్ కమిటీ - ఉప సభాపతి, |
| తెలంగాణ శాసనసభ ప్రభుత్వ హామీల కమిటీ - పట్లోళ్ల సంజీవ రెడ్డి |
| రూల్స్ కమిటీ - సభాపతి, |
| తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ - రేవూరి ప్రకాశ్ రెడ్డి |
| **శాసనమండలి కమిటీలు** |
| పిటిషన్స్ కమిటీ - ఉప ఛైర్మన్, తెలంగాణ శాసనమండలి |
| ప్రివిలేజెస్ కమిటీ - ఉప ఛైర్మన్, తెలంగాణ శాసనమండలి |
| ప్రభుత్వ హామీల కమిటీ - కేతావత్ శంకర్ |
| రూల్స్ కమిటీ - ఛైర్మన్, తెలంగాణ శాసనమండలి సభ |
| ముందుంచిన పత్రాల కమిటీ - చల్లా వెంకట్రాం రెడ్డి |
| ఎథిక్స్ కమిటీ - మహేష్ కుమార్ గౌడ్ బొమ్మ |

# మణుగూరులో అత్యాధునిక పోలీస్ స్టేషన్ ప్రారంభం

**మాదకద్రవ్యాల నిర్మూలనపై ఉక్కుపాదం**
**డీజీపీ సీవీ ఆనంద్**



**మణుగూరు, మహా :** మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఈ రోజు డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. పదేళ్ల క్రితమే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ, నిధుల కొరతతో వాయిదా పడుతూ వచ్చిన ఈ నిర్మాణాన్ని సింగరేణి సంస్థ, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం మరియు భాగస్వాముల సమిష్టి కృషితో పూర్తి చేసినట్లు డీజీపీ వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ భవనాన్ని పరిశీలించిన అధికారులకు, అందులో ఏర్పాటు చేసిన మిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ మరియు ఆధునిక సదుపాయాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో జరిగిన సమావేశంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగంపై దృష్టి**

సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీలు, సంఘ వ్యతిరేక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. ఆధునిక సాంకేతికత, ముఖ్యంగా కృత్రిమ మేధస్సును విరివిగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. నేర పరిశోధనలో సమర్థత పెంచేందుకు సి.సి.టి.ఎన్.ఎస్ 3.0 లో సమాచారాన్ని సకాలంలో నమోదు చేయడం అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. మెరుగైన మౌలిక వసతులు ఫిర్యాదుదారుల్లో విశ్వాసాన్ని నింపడమే కాకుండా, సిబ్బందికి అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పిస్తాయని సందర్శకుల పుస్తకంలో నమోదు చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో హోంగార్డు నుంచి పోలీస్ బాస్ వరకు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉక్కు సంకల్పంతో పనిచేయాలని డీజీపీ పిలుపునిచ్చారు. భావి తరాలను ఈ మహమ్మారి నుంచి కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల విక్రేతలు, సాగుదారులను నక్సలైట్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తులుగా గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి, రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన ఏసీబీ

**రూ. 300 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు**

హైదరాబాద్, మహా : తెలంగాణ పోలీస్ శాఖలో అవినీతి తిమింగలాల వేటను అవినీతి నిరోధక శాఖ మరింత ముమ్మరం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేశారు. సోదాల సమయంలో ఆస్తుల చిట్టా బయటపడటంతో భీమ్‌రెడ్డి బీపీ ఒక్కసారిగా పెరగడంతో ఆయనను తొలుత ఆసుపత్రికి తరలించారు. వైద్యుల నివేదిక, ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం, ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో ఆయనను ఏసీబీ అధఇకారులు అధికారికంగా అదుపులోకి తీసుకున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు, భీమ్‌రెడ్డిని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచారు. కానిస్టేబుల్‌గా కెరీర్ ప్రారంభించి డీఎస్పీ స్థాయికి ఎదిగిన భీమ్‌రెడ్డి, ఇంత పెద్ద మొత్తంలో అక్రమాస్తులు వెనకేయడం పోలీస్ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

**నాలుగు రోజుల క్రితం సుదీర్ఘ సోదాలు**

నాలుగు రోజుల క్రితం (గురువారం) తెల్లవారుజాము నుంచే డీఎస్పీ భీమ్‌రెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన మొత్తం 16 ప్రాంతాల్లో ఏసీబీ ఏకకాలంలో ఆకస్మిక సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని నార్సింగి, ఇబ్రహీంబాగ్‌లోని లగ్జరీ విల్లా, గచ్చిబౌలి, టెలికాం నగర్, మణికొండలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాలలో భీమ్‌రెడ్డి సంపాదించిన విస్తుపోయే అక్రమాస్తులు బయటపడ్డాయి. లగ్జరీ విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో వాటాలు, ఐటీ కారిడార్‌లో ఖరీదైన ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లతో పాటు కర్ణాటకలోని దేవనహళ్లి, ఇతర ప్రాంతాలలో దాదాపు 45 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటికి అదనంగా, డీఎస్పీ ఇంటి నుంచి, బినామీ ఇళ్ల నుంచి రూ. 43.6 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలు, 20 కేజీల వెండి వస్తువులను అదుపులోకి తీసుకున్నారు. సోదాల సమయంలో లభించిన 23 విదేశీ మద్యం సీసాలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కేసు నమోదు చేసింది.





**భార్యకు వీడియో కాల్‌లో చూపిస్తూ**

# రైలు కింద పడి భర్త ఆత్మహత్య

**కాజీపేట, మహా :** వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడుతూనే ఎదురుగా వస్తున్న రైలు కింద పడి రాజేశ్ నాయక్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. రాజేశ్ వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా భార్య, తల్లిదండ్రుల మధ్య ఆస్తి వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి భార్యతో మరోసారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రాజేశ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు.తర్వాత రైల్వే పట్టాల వద్దకు చేరుకుని భార్యకు వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి, ఎదురుగా వస్తున్న రైలు కింద పడ్డాడు. అయితే అతడు కేవలం భయపెడుతున్నాడని భావించిన భార్య దీనిని సీరియస్‌గా తీసుకోలేదు.రాత్రంతా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. సోమవారం ఉదయం కాజీపేట సమీపంలోని రైల్వే పట్టాలపై ఉన్న మృతదేహం రాజేశ్‌దేనని గుర్తించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# చెల్లెలి నిశ్చితార్థం నుంచి వస్తూ విషాదం

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దగోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం.. చెల్లెలి నిశ్చితార్థ కార్యక్రమం కోసం ఏర్పల్లి గ్రామానికి వెళ్లిన రాఘవేంద్ర ప్రసాద్, మనోహర్, భవాని, కార్తికేయ టీఎస్07 జేబీ 5801 నంబర్ కారులో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. రాఘవేంద్ర ప్రసాద్ కారు నడుపుతుండగా, మనోహర్ ముందు సీటులో, భవాని, కార్తికేయ వెనుక సీటులో కూర్చున్నారు.పెద్దగోల్కొండ ఓఆర్ఆర్ ఎక్స్‌టెన్షన్ 15 వద్ద రెండో లేన్‌లో వెళ్తుండగా, అదే లేన్‌లో ముందుగా వెళ్తున్న గుర్తుతెలియని లారీ ఒక్కసారిగా వేగం తగ్గించింది. దీంతో కారు అదుపుతప్పి లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న మనోహర్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న రాఘవేంద్ర ప్రసాద్‌తో పాటు భవాని ముఖం, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కార్తికేయ కూడా గాయపడగా, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఎనుమాముల ఈవీ ఎం గోదాంను తనిఖీ

**వరంగల్ జిల్లా**
**కలెక్టర్ డాక్టర్. సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** నెలవారీ తనిఖీ షెడ్యూల్ లో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద సోమవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్ లోని ఈవీఎం గోదాము ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎం ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణను పర్యవేక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా భారత ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, కలెక్టరేట్ సూపర్డెంట్ రజిని ఖిలా వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.




# ఫ్లైదీల్ హైదరాబాద్ రియాద్ విమాన సర్వీసులు ప్రారంభం...

**రాజేంద్రనగర్ మహా ;** సౌదీ గ్రూప్ కు చెందిన తక్కువ ధరల విమానయ సంస్థ ఫ్లైదీల్ తొలి హైదరాబాద్, రియాద్ విమాన సర్వీసును శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జీఎంఆర్, ఎయిర్ లైన్స్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ ఎయిర్‌లైన్ ఫ్లైదీల్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రియాద్‌కు ప్రతిరోజూ నేరుగా నడిచే విమాన సర్వీసులను సోమవారం ప్రారంభమయ్యాయి.ప్రతిరోజు 11.20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 7.55 గంటలకు బయలుదేరి, రియాద్ కు ఉదయం 11.5 చేరుకుంటుంది.శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ సీఈవో శ్రీ కదిర్ కదిరవన్ మాట్లాడుతూదీని ద్వారా హైదరాబాద్‌కు సౌదీ అరేబియా ప్రాంతంతో అనుసంధానం మరింత బలపడింది. పర్యాటకులు, వ్యాపారవేత్తలకు, ప్రవాస భారతీయులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి



కారేపల్లి, మహా: విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం చర్లపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు ఉన్నం నాగేశ్వరరావు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. చర్లపల్లికి చెందిన పాడి గేదెలు సోమవారం మేతకు వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చాయి. వాటిలో ఇంటి అవరణలో ఉన్న కోయ గుంజలకు కట్టివేశారు. కోయగుంజకు అనుకోని ఇనుప కడ్డి ఉంది. దాని పైనుండి ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే సర్వీస్ వైరును లాగారు. పాడి గేదెను ఇనుప కడ్డి అనుకోని ఉన్న గుంజ కు కట్టివేశారు. ఇనుప కడ్డికి కి సర్వీస్ వైరు జీ వైరు నుండి విద్యుత్ సరఫరా అయి పాడి గేదెకు విద్యుత్ షాక్ తగలింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీనికి సంబంధించి బాధిదు ఉన్నం నాగేశ్వరారవు విద్యుత్ అధికారులకు, పశువైద్యాధికారులకు పిర్యాదు చేశారు.

# ఖైరతాబాద్‌లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమీక్షించిన బిఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి



**ఖైరతాబాద్, మహా :** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం, ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని తాత నగర్‌లో నిశాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మన్నె గోవర్ధన్ రెడ్డి, ఓటరు నమోదు మరియు సవరణల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం సూపర్వైజర్ వెంకటేష్, 77వ డివిజన్ బూత్ స్థాయి అధికారి మౌనిక, 78వ డివిజన్ బూత్ స్థాయి అధికారి సంఘమిత్రలతో పాటు బూత్ స్థాయి ఏజెంట్లు దస్తగిరి , భరత్‌లతో కలిసి ఓటరు జాబితాల ప్రత్యేక పరిశీలన ప్రక్రియను మన్నె గోవర్ధన్ రెడ్డి సమీక్షించారు. ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని అధికారులను కోరారు. అలాగే, నియోజకవర్గ ప్రజలందరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకొని, అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, బాలరాజు యాదవ్, క్రాంతి, ప్రభాకర్ రెడ్డి, బిట్ల శ్రీనివాస్ రాజ్, రోహిత్ కుమార్, రావుల విజయ్ కుమార్, శ్రీధర్ మరియు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గోడ పత్రాలు విడుదల



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ భవన కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బృందం నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డి.ఎం.హెచ్.ఓ. మాట్లాడుతూ ఈ నెల 13 నుండి జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 19 సంవత్సరాలు వయస్సు గల పిల్లలందరికీ మాత్రలను అందజేయాలని ఆయన కోరారు. జిల్లాలోని 930 అంగన్వాడీ కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకున్న వారికి, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులందరికీ ఆల్బెండ జోళ్ళు అందజేసి తినిపించాలని ఆయన ఆదేశించారు. మంచిర్యాల జిల్లాలో 1 లక్ష 58 వేల 480 మంది పిల్లలకు మాత్రలు, గుళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. వివిధ మండలాలలో ఉన్న ఆశ ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న పిల్లల తల్లులకు, పాఠశాలల విద్యార్థులకు, పోషక ఆహార లోపం కలిగిన వారికి, రక్తహీనత, శరీరక పెరుగుదల లేనివారికి మాత్రలు పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు సగం టాబ్లెట్ ఇవ్వాలన్నారు. మూడు సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ పొడిచేసి తాగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్. ఎం ఓ డాక్టర్ భీష్మ, శ్రీధర్, రవి, సుధాకర్ నాయక్, అరుణ శ్రీ, అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, రషీద్, ఆర్ఎస్ పద్మ, డిపిఓ ప్రశాంతి, సుమన్, నరేందర్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు వైద్య బృందం నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గోడపత్రాలను, కరపత్రాలను విడుదల చేశారు.

**అంజనాపురంలో**

# గ్రంథాలయ ప్రారంభం

**తల్లాడ, మహా:** ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అంజనాపురం గ్రామంలో క్రీస్తుశేషులు కేతినేని చలమయ్య, భద్రమ్మ కుమారుడు కేతినేని బాబు జ్ఞాపకార్థం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సోమవారం టీడీపీ రాష్ట్ర నాయకుడు కేతినేని హరీష్ చంద్ర, సర్పంచ్ రాధాకృష్ణయ్య, ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "గ్రంథాలయాలే జ్ఞాన దేవాలయాలు" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని దినపత్రికలు, పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కిన్నెర వెంకటేశ్వరరావు, కేతినేని వీరరామారావు, కేతినేని వెంకటరామారావు, అనుములు రాంబాబు, చందా వెంకటేశ్వర్లు, భూక్యా బాబు, బంటి భూక్యా, వంశీ, అఖిల్, గోపి, అశోక్, చంద్రయ్య, నాగయ్య, తేజావత్ రాంబాబుతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కర్తవ్యం...

**వందలు కాదు, వేలు కాదు, లక్షలు కాదు... ఏకంగా లక్ష కోట్లు. ఇప్పుడు ఆ లక్ష కోట్లు గోదారిలో కలిసి పోయాయి. బహుళ ప్రయోజనాలు ఇస్తుందని ఆశించిన ప్రాజెక్టు అలంకారప్రాయంగా మారింది. ఇప్పుడు చుక్కనీరు కూడా ఆ ప్రాజెక్టు నుంచి వాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. అదే నాటి సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు. అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ ఓ అద్భుత సృష్టి చేస్తున్నారని, పాతాళంలో వున్న నీటిని పైకి తెచ్చి పడావు పొలాలను పంట పొలాలుగా మారుస్తున్నారని తెలంగాణ ప్రజలు తెగ సంబర పడ్డారు. అన్నదాతలు ఆనందం వ్యక్తం చేసారు. బీడు వారిన తమ భూములు మళ్ళీ పచ్చదనంతో పరవశించి పోతాయని కలలు కన్నారు. ఈ కలలన్నీ ఆవిరి అయ్యాయి. లక్ష కోట్లు ఇప్పుడు ఎకరం భూమికి కూడా నీళ్లు ఇవ్వట్లేదు. మళ్ళీ భూములు పగుళ్లతో వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు అనుసంధానమైన మేడిగడ్డ వంతెన పగుళ్లతో కథ అడ్డం తిరిగింది.**

కాళేశ్వరం ఇప్పుడు ఓ రాజకీయ వేదికకు ప్రాజెక్ట్ గా మారి తెలంగాణ రాష్ట్ర అప్పులను గుర్తు చేస్తోంది. ఇక కాళేశ్వరం ఎందుకు పనికి రాదా? ఈ ప్రాజెక్ట్ కథ ముగిసిన అధ్యాయంగానే మిగిలిపోతుందా? ఈ సమస్యకు పరిష్కారం లేదా? కాళేశ్వరం ప్రాజెక్ట్ ఓ తెల్ల ఏనుగుగా ప్రభుత్వానికి కనిపిస్తోందా? ఈ ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో మొదలు అయ్యాయి. కాళేశ్వరం ఓ అద్భుతమైన ప్రాజెక్ట్ గా గత పాలకులు చెప్పుకుని వచ్చారు. అది తెలంగాణకు వర ప్రసాది అన్నారు. రైతులకు ఇక సాగు నీటి కష్టాలు ఉండవన్నారు. అలాంటి కాళేశ్వరం ఇప్పుడు అధికార, విపక్షాల ఆరోపణలు, విమర్శలకు మాత్రమే ఉపయోగపడుతోంది. మేడిగడ్డ వంతెన పిల్లర్స్ కుంగి పోవటం పెద్ద దుమారం రేపింది. కుంగిన పిల్లర్స్ కు మరమ్మత్తులు చేస్తే సరిపోతుందనే పరిస్థితి ఇప్పుడు లేదంటున్నారు పాలకులు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం మొత్తం లోపభూయిష్టంగానే ఉందని, ఈ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసే ప్రయత్నం చేస్తే అది పెను ప్రమాదానికి దారి తీయవచ్చని పాలకుల వాదన. అలాంటి దుర్భర పరిస్థితి ఏమి లేదని, కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి నీటిని వాడుకునే అవకాశం ఉందని, అయినా ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయటం లేదని విపక్ష బీఆర్ ఎస్ నేతలు అంటున్నారు. ఇదే ఇప్పుడు తెలంగాణలో ఓ పెద్ద సమస్యగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్ట్ కు అసలు ఏమైంది? ఈ ప్రాజెక్ట్ ను వినియోగించుకునే అవకాశం లేదా? అనేది ఇప్పుడు నిపుణులు తేల్చి చెప్పాల్సి వుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు సంబంధించిన మేడిగడ్డ, సుందిళ్ల పల్లి, అన్నారం బ్యారేజీల్లో సాంకేతిక లోపాలు ఉన్నట్టు ప్రభుత్వం చెబుతోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తే బ్యారేజీలు కొట్టుకుపోయి ఊర్లకు ఊర్లే మునిగి పోతాయని మంత్రులు అంటున్నారు. ఇదే నిజమైతే ఇక కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎప్పటికి వినియోగించుకునే పరిస్థితి వుండదు. అంటే ఈ ప్రాజెక్ట్ పైన పెట్టిన లక్షల కోట్ల రూపాయలు గోదాట్లో కలిసినట్టే. ఇది తెలంగాణ రాష్ట్రానికి ఓ పెద్ద దెబ్బ. లక్ష కోట్ల అప్పు ఇప్పుడు ప్రజల నెత్తిన పడినట్టే. ఒక్క ప్రాంతానికి కూడా సాగు, తాగు నీరు అందించకుండానే ప్రజలు లక్ష కోట్ల అప్పు భరించవల్సి వస్తోందా అనేదే ఇప్పుడు పెద్ద సందేహం. దీనికి బీఆర్ఎస్ నుంచి భిన్నమైన సమాధానం వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పైన ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలలో నిజం లేదని, ప్రాజెక్ట్ అంత ప్రమాదకర పరిస్థితిలో ఏమాత్రం లేదని అంటున్నారు. ఓ పది రోజులు పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్ ను మాజీ సీఎం కేసీఆర్ కు అప్పగిస్తే ఈ ప్రాజెక్ట్ ద్వారా నీటిని పారించి చూపిస్తామని సవాల్ విసురుతున్నారు. ఇదే ఇప్పుడు చర్చగా మారింది. కాళేశ్వరం ముట్టుకుంటే ముప్పు తప్పదు అంటున్నారు తెలంగాణ మంత్రులు. ప్రాజెక్ట్ ను కేసీఆర్ కు అప్పగిస్తే వినియోగంలోకి తెచ్చి చూపిస్తాం అంటున్నారు బీఆర్ఎస్ నేతలు... ఇందులో ఎవరి వాదనలో నిజం వుంది. ఇదే ఇప్పుడు తేలాల్సి వుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం ఓ ప్రణాళిక ప్రకారం జరగలేదు అన్నది కాంగ్రెస్ ప్రభుత్వ ఆరోపణలు. కమిషన్ల కోసం నాసిరకంగా ప్రాజెక్ట్ నిర్మాణం చేసి తెలంగాణ ప్రజలను వంచించిన బీఆర్ఎస్ ఇప్పుడు ఏదో అద్భుతం చేస్తామంటూ ప్రజలను మరో సారి మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ నేతలు నిప్పులు చెరుగుతున్నారు.

సుదీర్ఘకాలం ప్రజలకు బహుళ ప్రయోజనాలు అందించే ప్రాజెక్ట్ ల నిర్మాణ విషయంలో ప్రభుత్వాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే ఇదిగో కాళేశ్వరం ప్రాజెక్ట్ వంటి సమస్యలు ఎదురవుతాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజ్, దవళేశ్వరం బ్యారేజ్ ఇప్పటికి చెక్కు చెదర లేదు. అనేక వరదలు ఎదుర్కొని నిలిచిన ఈ ప్రాజెక్ట్ లు అప్పటి ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు. ఇక దశాబ్ద కాలం కిందట కర్ణాటక ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మాణం అయిన ఆల్మట్టి, మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్రి ప్రాజెక్ట్ లు పటిష్టంగానే వున్నాయి. మరి ఇటీవలే నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక్కటి మాత్రమే ఎందుకు విఫలం అయింది. ఇక్కడే కక్కుర్తి కనిపిస్తుంది. నాణ్యమైన పనులు చేయకపోవటం, ప్రాజెక్ట్ భవిష్యత్ ను నిర్లక్ష్యం చేయటం, అన్నింటికీ మించి జవాబుదారీతనం లేకపోవటం వంటి లోపాలు ఇక్కడ కనిపిస్తాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను వేగంగా పూర్తి చేసి ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలి అనే ప్రయత్నంలో ప్రాజెక్ట్ నిర్మాణం పర్యవేక్షణ గాలికి వదిలి వేయటం వల్లే ఈ దుస్థితి వచ్చిందని సాంకేతిక నిపుణులు అంటున్నారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ ను ఇలాగే గాలికి వదిలి వేయటం కూడా సబబు కాదన్నది వారి సూచన. ప్రాజెక్ట్ డిజైన్, నిర్మాణ లోపాలు అత్యంత లోతుగా పరిశీలన చేసి అవసరమైన స్థాయిలో మరమ్మతులు చేస్తే ప్రయోజనం ఉంటుందని వారు చెపుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర నిపుణులు, ఇంజినీర్లు, ప్రాజెక్ట్ ల నిర్మాణంలో అత్యంత అనుభవం వున్న మేధావులు అధ్యాయనం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద కుంగిన పిల్లర్లు పరిశీలన చేశారు. సుందిళ్లపల్లి, అన్నారం బ్యారేజీల పటిష్టతను పరిశీలించారు. దీనికి సంబందించిన నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మత్తుల పైన ప్రభుత్వం ఆలోచనలు కూడా చేస్తోంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ తో లింకు వున్న సుందిళ్లపల్లి, అన్నారం బ్యారేజీలు కూడా ఇప్పుడు ప్రభుత్వానికి సవాల్ గా మారుతున్నాయి. వీటి నిర్మాణంలోనూ లోపాలు ఉన్నట్టు నిపుణులు తేల్చి చెప్పటంతో ప్రభుత్వం సంకట పరిస్థితిలో పడింది. దీన్నే బీఆర్ఎస్ తప్పు పడుతోంది. ప్రభుత్వం చెబుతున్నట్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తానికి మొత్తం బలహీనంగా లేదని, కేవలం కేసీఆర్ పై కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ ను పడావులో పడేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు వాదిస్తున్నారు. ఇదంతా ఓ ఎత్తు అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కు అప్పగించి చూడండి. నీళ్లు ఎలా పారిస్తారో గమనించండి అంటూ ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. అంటే కాళేశ్వరం ప్రాజెక్ట్ ను వినియోగించుకునే మరో ఐడియా ఏదో బీఆర్ఎస్ వద్ద వుంది అనేది ఇప్పుడు ప్రజల మాట. అయితే బీఆర్ఎస్ సవాల్ ను ప్రభుత్వం కొట్టి పారేస్తోంది. అసలు ప్రాజెక్ట్ మొత్తం లోపాలతో నిర్మాణం అయిందని, ఈ ప్రాజెక్ట్ వినియోగంపైన నిపుణులే పెదవి విరిచారని మంత్రులు వివరిస్తున్నారు. వాద, ప్రతివాదాల మధ్య ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

సవాళ్లు, ప్రతి సవాళ్లు ఎలా వున్నా ఇప్పుడు సంకట పరిస్థితులు వచ్చి పడుతున్నాయి. ఎల్ నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ స్పష్టంగా చెప్పేసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవటం లేదు. అన్నదాతలు దుక్కిదున్నీ వేసిన విత్తనాలు మొలకలు వచ్చి ఎండి పోతున్నాయి. ఇప్పుడు ఆకాశం వైపు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. చినుకులు తప్పా భారీ వర్షాలు కురవటం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సాగు పూర్తిగా చతికిల పడుతుంది. అధికార, ప్రతిపక్షం వివాదాల మాట ఎలా వున్నా ముందు రైతుకు ఉపశమనం కలిగించే రీతిలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్ట్ వినియోగం ఇప్పుడు సాధ్యం అయ్యే సూచనలు లేవు. ఇప్పుడు మరో మార్గం ఏమిటి? అన్నదాతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అభయ హస్తం ఇస్తుంది. ప్రభుత్వం ఏం ఆలోచిస్తోంది. సాగును ఎలా ముందుకు తీసుకొని వేడుతుంది. ఇవే ఇప్పుడు ప్రధానమవుతున్నాయి. కరువు కాలం కాటేసేందుకు బుసలు కొడుతోంది. ఇప్పుడు రాజకీయాలు పక్కన పెట్టి అన్నీ పార్టీలు ఏకం కావాల్సిన పరిస్థితి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కలహం కన్నా కర్షకుల కష్టం తీర్చటం ఇప్పుడు ముఖ్యం. ఆ దిశగా ఇప్పుడు తెలంగాణలోని రాజకీయ పార్టీలు ఆలోచన చేయాలి.. అన్నదాతకు అండగా నిలవాలి...ఇదే ఇప్పుడు కింకర్తవ్యం...



జీ. వెంకటరమణ.
సీనియర్ జర్నలిస్ట్.

# ధోనీ... నాయకత్వానికి చిరునామా



**(కోట్లాది క్రికెట్ అభిమానుల ఆరాధ్యదైవం, భారత క్రికెట్ స్వర్ణయుగానికి రూపశిల్పి మహేంద్ర సింగ్ ధోనీ జన్మదినం సందర్భంగా....)**



అమరవాజీ నాగరాజు
జర్నలిస్ట్

ఒక నాయకుడిగా జట్టును విజయపథంలో నడిపించాడు. ఒక బ్యాటర్‌గా అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. ఒక వికెట్‌కీపర్‌గా కనురెప్పపాటులో మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. ఒత్తిడి ఎంత తీవ్రమైనా ప్రశాంతతను కోల్పోకుండా విజయాన్ని అందిపుచ్చుకోవడం ఎలాగో ప్రపంచానికి చూపించాడు. విమర్శలకు మాటలతో కాదు... తన ఆటతో, తన నాయకత్వంతో సమాధానం చెప్పాడు. అందుకే మహేంద్ర సింగ్ ధోనీ కేవలం గొప్ప క్రికెటర్ మాత్రమే కాదు నాయకత్వానికి నిర్వచనం, ఆత్మవిశ్వాసానికి ప్రతీక, కోట్లాది మంది యువత కలలకు రూపం.

ఎలాంటి క్రికెట్ నేపథ్యం లేని సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు... స్వప్రతిభను నమ్ముకుని, కఠోర శ్రమను ఆయుధంగా మార్చుకుని, అచంచలమైన ఆత్మవిశ్వాసంతో ప్రపంచ క్రికెట్ శిఖరాన్ని అధిరోహించాడు. రాంచీ వీధుల నుంచి ప్రపంచకప్‌ను ముద్దాడే వేదిక వరకు సాగిన మహేంద్ర సింగ్ ధోనీ ప్రస్థానం అసాధ్యాలను సుసాధ్యాలుగా మలచుకోవడం ఎలాగో చాటి చెప్పిన స్ఫూర్తిదాయక జీవనగాథ.

ఝార్ఖండ్‌లోని రాంచీ అనే నగరం నుంచి వచ్చిన కుర్రాడు దేశ క్రికెట్ జట్టులోకి వస్తాడని, ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తాడని ఎవరూ ఊహించలేదు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ధోనీ చిన్నప్పటి నుంచి ఫుట్ బాల్ గోల్‌కీపర్. యాదృచ్ఛికంగా వికెట్ కీపర్‌గా మారిన ఆ కుర్రాడు తర్వాత ప్రపంచ క్రికెట్‌లోనే అత్యుత్తమ వికెట్ కీపర్లలో ఒకరిగా నిలిచాడు. జీవితంలో అవకాశాలు ఎప్పుడూ మనం కోరుకున్న రూపంలో రావని, వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకున్నవారే చరిత్ర సృష్టిస్తారని ధోనీ జీవితం పాఠం చెబుతుంది.

రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పనిచేసిన రోజులు ధోనీ జీవితంలో కేవలం ఉద్యోగ కాలం మాత్రమే కాదు... ఆయన వ్యక్తిత్వాన్ని మలిచిన కీలక దశ. విధి నిర్వహణలో నిబద్ధత, సమయ పాలనలో కచ్చితత్వం, క్రమశిక్షణ, ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా ఉండే స్వభావం... ఈ లక్షణాలన్నీ తర్వాత ఆయన నాయకత్వంలో స్పష్టంగా కనిపించాయి. ప్రపంచ క్రికెట్ శిఖరాన్ని అధిరోహించినా, కోట్లాది అభిమానుల ఆరాధ్య ఆటగాడిగా ఎదిగినా, విజయాన్ని ఎప్పుడూ తలకెక్కించుకోలేదు. అదే వినయం, అదే హుందాతనం, అదే సమతుల్య వ్యక్తిత్వం ధోనీని మిగతా ఆటగాళ్ల కంటే భిన్నంగా నిలబెట్టాయి.

భారత జట్టులో ధోనీ ప్రస్థానం అంత సులువుగా మొదలుకాలేదు. తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లోనే రనౌట్‌గా వెనుదిరిగాడు. విమర్శలు వెల్లువెత్తాయి. అతని సామర్థ్యంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ ధోనీ వాటన్నింటికీ మాటలతో సమాధానం చెప్పే వ్యక్తి కాదు. తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చే మనస్తత్వం అతనిది. 2005లో విశాఖపట్నం వేదికగా పాకిస్థాన్‌పై కేవలం 123 బంతుల్లో 148 పరుగులతో ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ప్రపంచ క్రికెట్ దృష్టిని ఒక్కసారిగా అతని వైపు తిప్పింది. ఆ ఇన్నింగ్స్ ఒక యువ ఆటగాడి ప్రతిభను మాత్రమే చాటలేదు; భారత క్రికెట్‌లో కొత్త శకానికి నాంది పలికింది. ఆ రోజు నుంచి మహేంద్ర సింగ్ ధోనీ పేరు భారత జట్టులో మరో ఆటగాడిగా కాదు... జట్టుకు భవిష్యత్తులో దిశానిర్దేశం చేయబోయే నాయకుడిగా మార్మోగడం ప్రారంభమైంది.

కానీ ధోనీని గొప్పవాడిగా నిలబెట్టింది అతని బ్యాటింగ్ మాత్రమే కాదు... అతని నాయకత్వం. నాయకత్వం అంటే ఆవేశం ,ఆలోచన,దూకుడు కాదు...దూరదృష్టి. క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, ఒత్తిడిలోనూ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపడం, ఆటగాళ్ల సామర్థ్యాన్ని నమ్మి వారికి అండగా నిలవడం ధోనీ నాయకత్వానికి ప్రత్యేక గుర్తింపు. అందుకే ఆయన కెప్టెన్‌గా మాత్రమే కాదు, మ్యాచ్‌ను చదివే వ్యూహకర్తగా, జట్టును తీర్చిదిద్దిన మార్గదర్శిగా భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

2007 టీ20 ప్రపంచకప్ ధోనీ నాయకత్వ ప్రతిభకు గొప్ప నిదర్శనం. అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకుండా యువ జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టి భారత క్రికెట్‌లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. అదే ఆత్మవిశ్వాసం నాలుగేళ్ల తర్వాత 2011 వన్డే ప్రపంచకప్ విజయంగా వికసించింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో నువాన్ కులశేఖర బౌలింగ్‌లో ధోనీ బాదిన ఆ చిర స్మరణీయ సిక్సర్ 28 ఏళ్లుగా ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తున్న కోట్లాది భారతీయుల కలలను నిజం చేసిన చారిత్రక ఘట్టం. ఆ బంతి బౌండరీ దాటిన క్షణం భారత క్రికెట్ స్వర్ణాక్షరాలతో కొత్త చరిత్రను లిఖించింది. అదే క్షణం మహేంద్ర సింగ్ ధోనీ పేరు భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

2013 ఛాంపియన్స్ ట్రోఫీ విజయంతో మూడు ప్రధాన ఐసీసీ టోర్నీలను గెలిపించిన ఏకైక కెప్టెన్‌గా మహేంద్ర సింగ్ ధోనీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్నాడు. ఇది అదృష్టం కలిసొచ్చి సాధించిన ఘనత కాదు. మ్యాచ్ పరిస్థితులను క్షణాల్లో అంచనా వేసే మేధస్సు, ప్రత్యర్థి వ్యూహాలను ముందుగానే పసిగట్టే దూరదృష్టి, ఆటగాళ్ల సామర్థ్యాన్ని సరైన సమయంలో సరైన రీతిలో వినియోగించే నాయకత్వ నైపుణ్యం ఆయన విజయాలకు అసలైన పునాది. అందుకే ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ కెప్టెన్ల గురించి చర్చ వచ్చినప్పుడల్లా ధోనీ పేరు ముందువరుసలో నిలుస్తుంది.

అయితే ధోనీ వారసత్వాన్ని ట్రోఫీలతో కొలవడం సరైంది కాదు. ఆయన కెప్టెన్సీలో తీర్చిదిద్దిన ఆటగాళ్లే భారత క్రికెట్‌కు అసలైన సంపద. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వంటి యువ ఆటగాళ్ల ప్రతిభను తొలినాళ్లలోనే గుర్తించి, ఒత్తిడి పరిస్థితుల్లోనూ వారిపై విశ్వాసం కోల్పోకుండా అవకాశాలు కల్పించాడు. ఆ నమ్మకమే వారిని ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి ఆటగాళ్లుగా నిలబెట్టింది.

వికెట్‌కీపర్‌గా ధోనీకి ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. బ్యాట్స్‌మన్ క్రీజు దాటకముందే మెరుపు వేగంతో బైల్స్‌ను గాల్లోకి ఎగరేసే ఆయన స్టంపింగ్స్ ఇప్పటికీ క్రికెట్ ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తుంటాయి. బ్యాట్స్‌మన్‌గా 'హెలికాప్టర్ షాట్'కు కొత్త గుర్తింపునిచ్చిన ఆటగాడిగా నిలిచాడు.

ప్రపంచవ్యాప్తంగా అపారమైన కీర్తి, సంపద, అభిమానాన్ని సంపాదించినా ధోనీ వ్యక్తిత్వంలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. విజయాన్ని ఎప్పుడూ తలకెక్కించుకోలేదు. సాదాసీదా జీవనశైలి, భారత సైన్యం పట్ల అపారమైన గౌరవం, తన మూలాలను ఎప్పటికీ మరచిపోని నిరాడంబర స్వభావం ఆయనను మరింత ఉన్నతంగా నిలబెట్టాయి.

నేటి యువతకు ధోనీ జీవితం ఒక స్ఫూర్తిదాయక సందేశం. అపజయాలు విజయానికి అడ్డంకులు కావు అవే విజయానికి పునాదులు. విమర్శలు ఎదురైతే మాటలతో కాదు, పనితీరుతో సమాధానం చెప్పాలి. ఒత్తిడి ఎంత తీవ్రమైనా ప్రశాంతతను కోల్పోకుండా సరైన నిర్ణయాలు తీసుకోగలిగితేనే విజయాన్ని అందుకోవచ్చని ధోనీ తన ప్రయాణంతో నిరూపించాడు..





# రాత్రికి రాత్రే విజ్ఞాన్ వేదాంత జూనియర్ కళాశాల మూసివేత

- **విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన**
- **ఏఎస్‌రావు నగర్‌లోనే కళాశాల కొనసాగించాలని డిమాండ్**

**కుషాయిగూడ, మహా :** ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని విజ్ఞాన్ వేదాంత జూనియర్ కళాశాలను యాజమాన్యం రాత్రికి రాత్రే మూసివేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. గత రెండేళ్లుగా ఏఎస్‌రావు నగర్‌లో నిర్వహిస్తున్న ఈ కళాశాలలో ప్రస్తుతం సుమారు 50 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు చదువుతున్నారు.కళాశాలను దిల్‌సుఖ్‌నగర్‌కు తరలిస్తున్నట్లు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజూ అంత దూరం ప్రయాణించి చదువుకోవడం సాధ్యం కాదని వారు తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండానే కళాశాలను మూసివేయడం వల్ల విద్యార్థుల చదువులకు అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏఎస్‌రావు నగర్‌లోనే ప్రత్యామ్నాయ భవనంలో విజ్ఞాన్ వేదాంత జూనియర్ కళాశాలను కొనసాగించాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

# ప్రజల ఫిర్యాదుల పై తక్షణమే స్పందించాలి

- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్**
- **పరిపాలనా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన సీపి**



**మహా వరంగల్ క్రైం;** పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదు పై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ప్రజలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం ఆమె తొలిసారిగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేసి, వాటి స్వాధీనానికి గల కారణాలు, కేసుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు నమోదులు, ఇతర పరిపాలనా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకుని, వారి విధి నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు ప్రజల సేవకులనే భావనతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి రసీదు అందజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించారనే నమ్మకం ప్రజల్లో కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను అనవసరంగా ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చే అత్యవసర ఫిర్యాదుల విషయంలో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, వెంటనే స్టేషన్ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే శాఖాపరమైన సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే సమర్పించాలని, వాటి పరిష్కార ప్రక్రియను స్టేషన్ అడ్మిన్ ఎస్‌ఐ పర్యవేక్షించి, బాధ్యతాయుతంగా నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఏసీపీలు నర్సింహరావు, సత్యనారాయణ, హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు నియోజకవర్గానికి రానున్న మంత్రులు ఎమ్మెల్యే..!

**ఇబ్రహీంపట్నం జూలై 6 మహా:** ప్రజా పాలన ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎమ్మెల్యే రంగారెడ్డి సహకారంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందని రమాకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బైరేక రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నేడు రాష్ట్ర మంత్రులచే 338 కోట్ల వ్యయంతో ఫోర్ లైన్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ఏర్పడిన వాటి నుంచి స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వందల కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నియోజకవర్గం అభివృద్ధి చేయడం జరుగుతుందని ప్రజల సంక్షేమం కోసం నియోజకవర్గంలో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం జరిగింది అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో ఎమ్మెల్యే రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తూ అమలు చేయడం జరుగుతుందని కొనియాడారు. నేడు ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలలో రహదారులను తీర్చిదిద్దేందుకు 338 కోట్ల నిధులతో, రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, ఈ రోజు తొర్రూరు గ్రామంలో ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి నాలుగు లైన్ల వెడల్పు రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, హాజరు కానున్న సందర్భంగా జిల్లా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పాల్గొనాలని రమాకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



# అణగారిన వర్గాల బంధువు బాబు జగ్జీవన్ రామ్

- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ,మహా :** సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డులోని ఆయన విగ్రహాలకు సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం బాబు జగ్జీవన్ రామ్ జీవితాంతం చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. దేశాభివృద్ధి, ప్రజాసేవలో ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావ్ భారత ఉప ప్రధానిగా పనిచేశాడని గుర్తు చేశారు బాబు జగ్జీవన్ రావ్ పేదల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడ్డ మహనీయుడని మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు కొనియాడారుఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, గుండారపు శ్రీనివాస్ రెడ్డి జేరిపోతుల ప్రభుదాస్ గొల్లూరి అంజయ్య బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వంజరి ప్రవీణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బార్ అసోసియేషన్ కు వినతి

**దమ్మపేట ,మహా :** అక్రమకేసులతో ఆందోళనకు గురి చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని , పోలీసులను,రాజకీయ నాయకులను అడ్డుపెట్టకొని విలువైన వ్యవసాయ సాగు భూములను కబ్జా చేసేవారికి ,వెన్నుదన్నుగా ఉండే పోలీసుల నుండి తనకు రక్షణ కావాలని కోరుతూ దమ్మపేట బార్ అసోసియేషన్ కు ఓ లాయర్ సోమవారం వినతి పత్రాన్ని అందించారు. వివరాలు పరిశీలిస్తే దమ్మపేట మండలంలోని నల్లకుంట గ్రామ శివారులో ఉన్న 273/1 సర్వే నంబర్ లో గోళ్ళ వెంకటేశ్వరరావు కుటుంబానికి చెందిన వ్యవసాయ సాగు భూమి లో కొబ్బరి మొక్కలు నాటారు. వాటిని గుర్తు తెలియని దుండగులు రాత్రి సమయంలో ద్వంసం చేశారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన గోళ్ళ వెంకటేశ్వరరావు తనయుడైన లాయర్ వృత్తి చేస్తున్న గోళ్ళ భవానీ కృష్ణ పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కనడం తో ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. ఈ విషయంపై తన సహచర న్యాయ వాదులను ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన కుటుంబానికి చెందిన సాగు భూమిలో మొక్కలు వేసుకుంటే ,మరెవరో వచ్చి ఆ భూమి తనదే అంటూ పంట ద్వంసం చేయడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ,తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన బార్ సభ్యులు రెవిన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించి న్యాయం చేయాలని ,లేని పక్షంలో జిల్లా అధికారులను కలిసి సమస్యను తెలియజేస్తామని హామీ ఇచ్చారు. అంతేగాక వాస్తవం గా లాయర్ భవానీకి అన్యాయం జరిగితే కోర్టు కు కూడా నిరాకరించి మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారని భవానీ పేర్కొన్నారు.



# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) నిధులతోశంషాబాద్ లోని పలు గ్రామాలలో సీసీ, బీటీ రోడ్లపనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. మండలంలోని చౌదర్ గూడా,కాచారం, పాలమాకుల గ్రామాల్లో, మండల అధికారులు,గ్రామ సర్పంచులు, మాజీ జెడ్పిటిసితో కలిసి 7.26 కోట్ల రూపాయల నిధులతో సిసి, బిటి రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సోమవారం శంకుస్థాపనలు చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ యొక్క లక్ష్యం అన్నారు. సర్పంచ్ను చుట్టుముట్టిన గ్రామస్తులు. తాము పన్నులను చెల్లిస్తున్నాము,కదా, తమ నివాసముండే ప్రాంతాల్లో ఎందుకు సీసీ రోడ్లు వేయడం లేదంటూ సర్పంచ్ను చుట్టుముట్టి వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మోడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంసం

**ఆదిలాబాద్ మహా:** తమ వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లను, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు నెల రోజులుగా పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 121 మోడీఫైడ్ సైలెన్సర్లను గుర్తించి తొలగించారు. సోమవారం వాటిని స్థానిక కలెక్టర్ చౌరస్తా నందు ఎస్పీ సమక్షంలో రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేసారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించకూడదని ఎస్పీ సూచించారు. ఇకనుండి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడుతుందని, మాడిఫైడ్ సైలెన్సర్లను బిగిస్తే ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా నిబంధనలు అతిక్రమించి పోలీస్ సైరన్ ను అనధికారికంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలా వినియోగిస్తున్న వారి ఫోటోను తీసి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ 8712659922 నెంబర్ కు తెలియజేయాలని అన్నారు.కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, ప్రణయ్ కుమార్, ఎస్ఐలు దేవేందర్, ప్రణయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి ప్రజలనుండి 71 దరఖాస్తులు

యాదగిరి భువనగిరి జులై 6 మహా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి లు వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 71 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 45, సంక్షేమ శాఖ 5, జిల్లా పరిషత్ 4, గ్రామీణ అభివృద్ధి 3, సర్వే ల్యాండ్స్ 3, హౌసింగ్ 2, అటవీశాఖ 2, పంచాయితీ 2, వ్యవసాయ, విద్య, ట్రాన్స్కో, కోపరేటివ్, ఎస్సీ డెవలప్మెంట్, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# హమాలీ కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది

- **మాజీ మంత్రి కేటీఆర్**
- **హమాలీలకు కనీస వేతనం అమలు చేయాలి**
- **మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్**

**కుషాయిగూడ, మహా :** మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఆవిర్భావ దినోత్సవ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ హమాలీ కార్మికులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సంక్షేమం కోసం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలను విజయవంతం చేసిన నిర్వాహకులను అభినందించారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు హమాలీ కార్మికులు వెన్నెముకలా నిలుస్తున్నారని అన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలకు అవసరమైన సరుకుల సరఫరాలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. హమాలీ కార్మికుల సంక్షేమం, భద్రత, జీవనోపాధి మెరుగుదలకు తమ పూర్తి సహకారం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హమాలీల కోసం కేసీఆర్ గత ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు అమాలి కార్మికుల కోసం ఈఎస్ఐ పిఎఫ్ ఉండాలని వారికి కూడా కనీస వేతనం అమలు చేయాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు, రాష్ట్ర అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి క్యామ మల్లేశం, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్టీయూ నాయకులు, హమాలీ సంఘం నాయకులు, బి ఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి కార్పొరేటర్లు, కొత్త రామారావు గుండారపు శ్రీనివాసరెడ్డి పన్నాల దేవేందర్ రెడ్డి గొల్లూరి అంజయ్య జేరిపోతుల ప్రభుదాస్ సాయి జన్ శేకర్ పార్టీ నాయకులు, కాసం మైపాల్ రెడ్డి వంజరి ప్రవీణ్ కరిపే మెమొరీ మహేష్ గౌడ్ బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి సప్పిడి శ్రీనివాస్ రెడ్డి షేరుమనెమ్మ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు పుట్ట ఎల్లయ్య శ్రీనివాస్ నాగరాజు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కుళ్ళిన అనాధ శవానికి అంత్యక్రియలు

**దమ్మపేట ,జూలై 6 మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలం లోని జమేదారు బంజర పరిసర అటవీప్రాంతంలో ఈ నెల 1 వ తేదీన మృతి చెందిన అనాద మహిళా మృతదేహానికి సోమవారం గౌతమ బుద్ధ స్వచ్చంద సేవా సంస్థ ఆద్వర్యంలో అంత్యక్రియలు జరిపారు. స్థానిక పోలీసులు అనాద మృతదేహాన్ని గత మూడు రోజుల క్రితం అశ్వారావుపేట లోని ప్రభుత్వ వైద్యశాల కు పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. మృతదేహానికి సంబందించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో అనాదగా గుర్తించిన పోలీసులు మందలపల్లి కి చెందిన గౌతమ బుద్ధ స్వచ్చంద సేవా సంస్థ సహాయాన్ని కోరారు. కాగా మందలపల్లి పంచాయతీ కార్యదర్శి ,పోలీసుల సమక్షంలో గౌతమ బుద్ధ స్వచ్చంద సేవా సంస్థ నిర్వాహకులు అనాద మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పాలడుగుల అబ్బులు ,షేక్ అజీమ్ , రొయ్యల కుమార్ ,జెసిబి సోము తదితరులు పాల్గొన్నారు.



# భూ వివాదాలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలి

**గిరిజన రైతులపై అక్రమ కేసులు తగవు**
**మాజీ ఎమ్మెల్యే మెచ్చా**

**దమ్మపేట,మహా:** మండలంలోని నల్లకుంట గ్రామ శివారులోని 273/1 వ్యవసాయ భూమిలో తరచుగా నెలకొంటున్న భూ వివాదాలపై అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు సోమవారం స్పందించారు. ఈ వ్యవసాయ సాగులో నాటిన దాదాపు 1100కొబ్బరి మొక్కలను కొందరు భూ స్వాములు అర్ధరాత్రి సమయంలో కొబ్బరి మొక్కలను చిందరవందరంగా నాశనం చేసారు. ఒకే సర్వే నంబరులో మరికొందరు భూ స్వాములు ఈ సాగుభూమి తమదేనంటూ, మొక్కలు వేసిన ఈ ప్రాంత రైతులు మళ్ళా కుమారి,జంగాల వెంకటేశ్వరరావు,గట్ల సర్వేశ్వరరావు, గోళ్ళ వెంకటేశ్వరరావు,బొగ్గం శివ లకు చెందిన కుటుంబ సభ్యుల పై అక్రమ కేసులు బనాయిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని బాదితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మెచ్చా నాగేశ్వరరావు ఘటన స్థలానికి వచ్చి బాదితులను ఓదార్చారు. జరిగిన పంట నష్టాన్ని కళ్ళారా వీక్షించి అనంతరం బాదితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఏదైనా భూ సమస్యలు ఉంటే రికార్డుల పరంగా,చట్ట పరిదిలో పరిష్కరించుకోవాలని సూచించారు. మెచ్చా వెంట మాజీ ఉపసర్పంచ్ దారా యుగంధర్, గాజుబోయిన ఏసు, అబ్దుల్ జిన్నా,పాశం ప్రసాద్,వెలుగోటి మహేష్‌తదితరులు ఉన్నారు.



# కేకే కమిటీ కాలయాపన కోసమేనా ?

**చిలువేరు రమేష్**

**భువనగిరి జూలై 6 మహా న్యూస్** ెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడానికి వేసిన కేకే కమిటీ కాలయాపన కోసమేనా అని మలిదశ ఉద్యమకారుడు చిలువేరు రమేష్ అన్నారు ఆయన సోమవారం మహా న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ కాలపరిమితి విధించకుండా విధివిధానాలు ప్రకటించకుండా ఉద్యమకారులను ఎలా గుర్తిస్తారని ఆయన ప్రశ్నించారు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజాపాలనలో పెట్టిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు నాన్చుడు ధోరణి మంచిది కాదని ప్రభుత్వానికి నష్టం జరుగుతుదని ఆయన అన్నారు




# చుంచుపల్లిలో సమస్యలను పరిష్కరించండి

- ఆచార్య డాక్టర్ మద్దెల శివకు-మార్ బృందం
- తాసిల్దార్ నాగరాజుకు వినతిపత్రం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. సోమవారం చుంచుపల్లి రెవెన్యూ కార్యాలయంలోని తాసిల్దార్ నాగరాజుకు పలు సమస్యలతో కూడిన మెమరాండమును సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ (సర్)లో అక్రమాలు జరగకుండా చూడాలని చుంచుపల్లి మండల పరిధిలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మితమవుతున్న పెద్దపెద్ద నివాస గృహాలను పెద్దపెద్ద ఆస్పత్రులపై విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ జరుగుతున్న ల్యాండ్ మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమైనందున విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లను త్వరితగతిన అందించాలని పేర్కొన్నారు. చుంచుపల్లి మండల పరిధిలో గుడుంబా విక్రయాలను డ్రగ్స్ సరఫరాను నియంత్రించాలని కోరారు. సాదా బై నామాలో ఇంటి నంబర్లు పేర్ల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అర్హత గల ప్రతి ఒక్కరికి పట్టాలు త్వరితగతిన మంజూరి చేయాలని తెలిపారు. ఈ సమస్యలపై తహసీల్దార్ నాగరాజు స్పందిస్తూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు సంఘ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి సల్మాన్ తోత, జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, కార్యదర్శి కేదాశికిరణ్, సభ్యులు సాయికుమార్, అటెండర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుకు పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి బ్యూరో, మహా**: ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. భూ వివాదాలు రెవెన్యూ సమస్యలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి మౌలిక వసతులు సామాజిక భద్రత ఇతర శాఖలకు సంబంధించిన వివిధ సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపిస్తూ నిర్దేశిత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు. ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి ఏమాత్రం తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన సంఘం నాగేశ్వరరావు తన తండ్రి మరణించడంతో ఆయన పేరుపై ఉన్న పట్టా భూమిని వారసత్వ హక్కు ప్రకారం తన పేరుకు మార్చాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి తదుపరి చర్యల కోసం సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్ కు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం రాజు తండా గ్రామానికి చెందిన అజ్మీర రవి కొత్తగూడెం-ఇల్లందు జాతీయ రహదారి విస్తరణలో తన ప్రహరీ గోడతో పాటు మూడు గదుల ఇల్లు కోల్పోతున్నందున తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి అవసరమైన చర్యల కోసం టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ఇందిరానగర్‌కు చెందిన పోతరాజు రమేష్ గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన శారీరక మానసిక వైకల్యంతో బాధపడుతూ 50 శాతం వైకల్యం ఉన్నందున కుటుంబానికి ఆర్థిక ఆధారం లేక చికిత్స భారంగా మారిందని పేర్కొంటూ వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ పరిశీలించి తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారికి ఎండార్స్ చేశారు. బూర్గంపహాడ్ మండలం ఎదుళ్ల చెరువు గ్రామానికి చెందిన దుర్గాల వెంకటేశ్వర్లు తాను 2000 సంవత్సరం నుంచి సాగు చేస్తున్న 1 ఎకరం 50 సెంట్ల పోడు భూమిలో సాటిలైట్ పాయింట్ మంజూరైందనే కారణంతో అధికారులు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆ భూమికి సంబంధించి సర్వే కూడా పూర్తయిందని పేర్కొంటూ వ్యవసాయం కొనసాగించేందుకు అనుమతి కల్పించాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి తగు చర్యల కోసం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దమ్మతల్లి వార్షిక బ్రహ్మోత్సవం

**అన్నదానం నిర్వహించిన ఆలయ కమిటీ**

**కారేపల్లి, మహా :** కారేపల్లిలోని పురాతన దేవాలయమైన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఆలయంలో అర్చకులు ముక్కామాల మల్లిఖార్జున శర్మ, సురేష్ శర్మ ల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకములు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులతో కుంకుమ పూజలు, గణపతి, మృత్యుంజయ నవగ్రహా శాంతి పూజలు జరిపించారు. అనంతరం ఆలయం కమిటీ అధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానాన్ని సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్, మాజీ వైస్ ఎంపీపీ దంపతులు ఇమ్మడి రమాదేవితిరుపతిరావులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తురక నారాయణ, పెర్ని వెంకటేశ్వర్లు, పొలగాని శ్రీ నివాస రావు, పెద్దమ్మ సత్యనారాయణ, తురక రాంబాబు, పాసిన్ని నాగేశ్వరరావు, పోతు రాములు, ఓరుగంటి రంగనాథ్, ఎనిక రవి చింతల సంపత్, యర్ర మాధవ్, తురక రవి, మల్లేష్, యవగందుల మధు తదితరులు పాల్గొన్నారు.





# సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ తరగతులు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సింగరేణి వ్యాప్తంగా ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే పునశ్చరణ శిక్షణా తరగతుల లో భాగంగా కొత్తగూడెం ట్రైనింగ్ సెంటర్లో రెండు వారాలపాటు జరిగే సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఏరియా సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమని పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్వహించే విధులతో యాజమాన్యం సంతృప్తిగా ఉందని క్రమశిక్షణ మెరుగు పడాలంటే శిక్షణ అవసరమని దానికి తగిన రీతిలో ఎస్ అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్ ను అభివృద్ధి చేసేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా నూతన విజ్ఞానాన్ని పునికి పుచ్చుకుని అధునాతన సాంకేతిక విజ్ఞానంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులను కాపాడాలని కోరారు. సెక్యూరిటీ సిబ్బందికి బేసిక్ రిఫ్రెషర్ ట్రైనింగ్, ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్, అన్ ఆర్మ్‌డ్ కంబాట్ ట్రైనింగ్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో శిక్షణనివ్వడం జరుగుతుందని వివరించారు. దానిలో భాగంగా రిఫ్రెషర్ ట్రైనింగ్ లో పిటి డ్రిల్ సెక్యూరిటీ ఆపరేషన్స్ మూడు విభాగాల్లో శిక్షణనివ్వడం జరుగుతుందని తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహద పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**వరంగల్, మహా:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి వివిధ సమస్యల పై వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.ఈ సందర్భంగా విభాగాల వారీగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి: టౌన్ ప్లానింగ్-42, ఇంజినీరింగ్-21, రెవెన్యూ-15, హెల్త్ & శానిటేషన్-4, నీటి సరఫరా-2, హార్టికల్చర్-1. మొత్తం 85 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, కార్యదర్శి అనిల్‌బాబు, హెచ్‌వో లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు అండగా వీఏకె సమైక్య ఫౌండేషన్

- ఇంజినీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ వన్నాల

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా ఉర్సు కరిమాబాద్ కు చెందిన మేకల లింగమూర్తి కుమార్తె మేకల సంజన కిట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నది. ఇటీవల పరీక్ష ఫీజు కోసం ఆర్థిక ఇబ్బందుల వల్ల తన తండ్రి మేకల లింగమూర్తి అభ్యర్థన మేరకు విఏకె ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బీజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ ద్వారా వారికీ రూ 10000 వేల ఆర్థిక సహాయాన్ని మేకల సంజన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ తన సోదరుడు డాక్టర్ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన వీఏకె సమైక్య ఫౌండేషన్ ద్వారా గత16 సంవత్సరాల నుండి పేదల సహాయం కొరకు స్థాపించి, సుమారు 600 పైగా కుటుంబాలు అలాగే వర్ధన్నపేట నియోజకవర్గం లోని పలు గ్రామాలలో నెలకు 10 కిలోల ఉచిత బియ్యం, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు కూడా చేయించడం జరిగింది. అంతేకాకుండా తల్లిదండ్రులను కోల్పోయిన అనాధ పిల్లలు, పేద పిల్లలు చదువుల కొరకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ, అనారోగ్యం తో ఉన్న పేదవారికి వారి చికిత్స కొరకు ఆర్థిక సహాయం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగు తుందన్నారు.. వీరి వెంట కాశీబుగ్గ మండల అధ్యక్షుడు అపురూప రజనీష్ నేత, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, రత్నం సతీష్ షా, రఘున్న రెడ్డి, దోమల భవన్ శంకర్, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# పన్ను వసూళ్ల లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలి

- నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- బల్దియా కమిషనర్ టి. వెంకన్న
- రెవెన్యూ అధికారుల పనితీరు పై కమిషనర్ సమీక్ష

మహా వరంగల్ కార్పొరేషన్ ; గ్రేటర్ వరంగల్ మహా నగర పరిధిలో నిర్దేశిత పన్ను వసూళ్ల లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా తప్పనిసరిగా సాధించాలని జిడబ్లుఎంసి కమిషనర్ టి. వెంకన్న అన్నారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూళ్ల పురోగతి పై సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సర్కిళ్ల వారీగా పన్ను వసూళ్ల స్థితిగతులు, ముందస్తు పన్ను చెల్లింపు పై ఐదు శాతం రాయితీ పథకం అమలు, రెవెన్యూ అధికారుల పనితీరును సమీక్షించిన కమిషనర్, ఆశించిన స్థాయిలో పురోగతి నమోదు కాకపోవడం పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వసూళ్లు మందగించడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో కాశీబుగ్గ ఉప కమిషనర్ ప్రసన్నరాణి ముందస్తు పన్ను చెల్లింపు పథకం కింద ఇప్పటివరకు సాధించిన వసూళ్లు గురించి వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి నెల తొలి వారంలో పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. నగరంలోని ప్రతి ఆస్తికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ఒక్క ఆస్తి కూడా పన్ను పరిధికి వెలుపల ఉండకూడదని స్పష్టం చేశారు. పన్ను పరిధిలో లేని ప్రతి ఆస్తిని గుర్తించి వెంటనే నమోదు చేయడంతో పాటు, అవసరమైన చోట పన్ను నిర్ధారణను సవరించాలని ఆదేశించారు.త్వరలో నగర వ్యాప్తంగా భౌగోళిక సమాచార వ్యవస్థ ఆధారంగా త్రి డి సర్వే చేపట్టనున్నందున, ఆ సర్వేకు ముందే అన్ని ఆస్తుల వివరాలు, పన్ను నిర్ధారణలు పూర్తిస్థాయిలో సక్రమంగా నమోదు చేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్తుల యాజమాన్య మార్పిడికి సంబంధించిన దరఖాస్తులను పక్షం రోజులలోపు పరిష్కరించాలని, ఆస్తి పన్ను లకు సంబంధించిన అంశాల్లో ఉద్యోగుల పై ఫిర్యాదులు వస్తే బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి రెవెన్యూ అధికారి, బిల్లు వసూలుదారు తమ పరిధిలోని నివాస, వాణిజ్య భవనాలు, పన్ను నిర్ధారణలు, కొత్తగా నమోదు చేయాల్సిన ఆస్తుల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను వసూళ్లపైనా ప్రత్యేక దృష్టి సారించి, నగర ఆదాయం పెరిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.పన్ను వసూళ్లు, పన్ను నిర్ధారణలు, దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, పన్నుల అధికారి రామకృష్ణ, కాశీబుగ్గ ఉప కమిషనర్ ప్రసన్నరాణి, సమ్మయ్య, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు వసూలు దారులు తదితరులు పాల్గొన్నారు.



# మంగలికుంట మతలబు ఏంటో....?




- బరితెగించిన భూ బకాసురులు.
- చోద్యం చూస్తున్న అధికారులు.
- కబ్జా కోరల్లో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి .

**దమ్మపేట ,మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండల పరిదిలోని మందలపల్లి గ్రామంలో కోట్ల రూపాయల ప్రభుత్వ చెరువు కబ్జాదారుల స్వంతమైంది. పట్టించుకోవాల్సిన అధికారులు నజరానాలకు కక్కుర్తి పడి జేబులు నింపుకుంటున్నారే తప్ప ,ప్రభుత్వ చెరువులను కుంటలను కాపాడటంలో విఫలమయ్యారనే ఆరోపణలు గ్రామస్థుల నుండి తరచుగా వినిపిస్తున్నాయి. నేడు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం దగా అవుతోంది. బరితెగించి భూ బకాసురులు వాటాలు వేసుకుని మరీ అమ్మేసుకుంటుంటే పట్టించుకోవాల్సిన ఇరిగేషన్ శాఖాధికారులు ,రెవిన్యూ అధికారులు వారి డొల్లతనాన్ని నిరూపించుకుంటున్నారు. ఈ మొత్తం తతంగంలో కోట్ల రూపాయల ఆస్తి చేతులు మార్పిడి లో అధికారులు లక్షల రూపాయలు వెనుకేసుకున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

**అసలు విషయానికి వస్తే :** మందలపల్లి ప్రధాన రహదారి ప్రక్కన గత కొంత కాలం క్రితం ఓ రైస్ మిల్లు పాడుపడి ఉండేది. దానికి ఆనుకొని దాదాపుగా 7 ఎకరాల వైశాల్యం లో ఊరకుంట గా పిలువబడే మంగలికుంట ఉండేదని స్థానికులు వెల్లడించారు. ప్రస్తుత కాలంలో ఆ మంగలి కుంట కనిపించకుండా కనుమరుగైపోయింది.

**మంగలికుంట విస్తీర్ణం :**
200 మీటర్ల పొడవున , 3 మీటర్ల వెడల్పు తో చెరువు కు కరకట్ట నిర్మించినట్లు రికార్డుల ద్వారా తెలుస్తుంది. సర్వే నంబర్ 514 లో 6ఎకరాల 23 సెంట్ల విస్తీర్ణం కలిగి ఉంది. దీని సామర్థ్యం 10లక్షల క్యూబిక్ అడుగులు వరకు నీరు నిల్వ ఉంచగలిగేంతటి మంగలికుంట క్రింద దాదాపుగా 7ఎకరాల వ్యవసాయ సాగుకు సరిపడు నీటి నిల్వను కలిగి ఉందని స్థానికులు తెలిపారు. మరి ఇప్పుడు ఆ ఊరకుంట గా పిలువబడే మంగలి కుంట ఏమైంది...? అనేది ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

**2025 లో సమాచారం కోసం :**
2342025 లో స్థానికులు కొందరు ఈ చెరువు కనిపించడం లేదని , మిషన్ భగీరథ పనులు ఏమైనా చేసినట్లు నకిలీ బిల్లులు పెట్టుకున్నారేమో నని సమాచారం కోసం సంబందిత ఇరిగేషన్ శాఖ వారిని 153/ఏ/ఐ.ఎస్ .డి. రిఫరెన్స్ నెంబరుతో లిఖితపూర్వకంగా సమాచారం సేకరించగా ,అసలు అక్కడ చెరువే లేదు ,కాబట్టి మిషన్ భగీరథ పనులు జరగలేదన్నట్లు సమాచారం ఇచ్చారు. అంతేగాక చెరువు ను ఎవరైతే ఆక్రమించారో దానిపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదంటే...అధికారులకు నిజంగా ఉద్యోగ విధులపట్ల చిత్తశుద్ధితో పని చేస్తున్నారా...? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.రెవిన్యూ రికార్డుల పరంగా చూస్తే సర్వే నంబర్ 514 లో చీమల పిచ్చయ్య కుంట , 6ఎకరాల 23కుంటలు శికం అని రికార్డుల లో నమోదైంది.

**ప్రస్తుతం పరిస్థితి :** ఊరకుంట గా పిలువబడే మంగలికుంట ను అక్రమంగా మట్టి తోలకాలు జరిపి ఇండ్ల ప్లాట్లుగా రూపాంతరం చేశారు. కొందరు పట్వారిగూడెం గ్రామ సమీపంలోని రైతులు తమ దేనంటూ కాగితాలు చూపించి విక్రయాలు చేసి సొమ్ము చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మరి కొందరు బడా బాబులు తమ బినామీ పేర్లతో పట్టాలు పొందారు. మరికొందరు చివరకు తేరుకొని చెరువు ప్రాంతానికి ఎవరూ వెళ్ళకుండా అడ్డంగా సిమెంట్ రాళ్ళతో ఫెన్సింగ్ ఏర్పాట్లు చేశారు. వీరందరి మధ్యలో అసలు కొనుగోలు చేసుకున్న వారు మాత్రం తమ పేర్లతో పట్టా మార్పిడి కి విశ్వ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

**విన్యూ అధికారులకు నజరానాలు...?**

చెరువు శిఖం ఒక్కటే కాకుండా ఏకంగా చెరువునే ఆక్రమించుకొని ఇండ్ల ప్లాట్లు ,షాపుల ప్లాట్లు నిర్మించుకుంటున్న వారికి రెవిన్యూ లో రిజిస్ట్రేషన్ లు చేపించాలంటూ మందలపల్లికి చెందిన ఓ గుత్తేదారు క్రొత్తగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం ఉంది. రెవిన్యూ లో రిజిస్ట్రేషన్ చేపిస్తే మీ ప్లాట్లకు తిరుగులేదని చెబుతూ రెవిన్యూ శాఖ లోని ఓ క్రింది స్థాయి అధికారికి 30 వేలు ఇస్తానని ఒప్పుకున్నట్లు స్థానికులు వివరిస్తున్నారు. ఐతే మధ్యలో ఉన్న వసూళ్ళ రాజా అందుకు రెండితలు వసూలు చేసి అధికారి పేరుతో పబ్బం గడుపుకుంటూ అక్రమంగా మరిన్ని వసూళ్ళ కు తెరలేపుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానికులు కొందరు ఈ అక్రమాలను అడ్డుకొని ప్రభుత్వ చెరువులను ,భూములను కాపాడుకోవాలనే ఆకాంక్ష తో వివిద శాఖల అధికారుల కు ,కోర్టు వారికి ,జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.



# ట్రాఫిక్ పోలీసుల... ఆరోగ్య భద్రతే ముఖ్యం.

**ట్రాఫిక్ ఏసిపి సుబ్బయ్య.**

**కుషాయిగూడ, మహా :** ప్రజా వ్యవస్థలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని, విధి నిర్వహణలో సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వారి భద్రత కోసం కృషి చేస్తున్నామని ట్రాఫిక్ ఏసిపి సుబ్బయ్య అన్నారు. ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఆదేశాల మేరకు జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ఆధునిక కాలంలో రకరకాల రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయని పోలీసులు శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలిగేందుకు యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు యోగ వైపు పయనిస్తుందని, యోగాభ్యాసం తోనే సర్వ రోగాలను నయం చేసుకోవచ్చు అన్నారు. భారత ప్రభుత్వం యోగ విద్యకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. 50 మంది పోలీసులకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- బీఎల్వోలతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసిన రంగారెడ్డి కలెక్టర్

**మొయినాబాద్ మహా:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని.. ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో పర్యటించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎనికేపల్లి మరియు కనకమామిడి
వార్డు బీఎల్వోలను ఎస్ఐఆర్ ఫారం పంపిణీ, నింపడం, డిజిటలైజ్ ప్రక్రియపై ఆరా తీసి, ఫీల్డ్ అధికారులు, బీఎల్వోలు, ఓటర్లకు ఎదురయ్యే సమస్యలపై సందేహాలు నివృత్తి చేశారు. అలాగే మండలంలో తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో 11వ వార్డు కౌన్సిలర్ మహేష్ విజ్ఞప్తి మేరకు ఎనికేపల్లిలోని హైస్కూల్‌లో కొత్తగా చేపట్టిన టాయిలెట్ల నిర్మాణం పరిశీలించారు. అలాగే ప్రైమరీ స్కూల్‌లో శిథిలావస్థకు చేరిన గదిని కూల్చివేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు

## కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటం

- కార్మికులకు అండ ఏఐటీయూసీ జెండా..
- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్...




**యాదాద్రి భువనగిరి, మహా:** కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. సోమవారం భువనగిరిలో జరిగిన ఏఐటీయూసీ మండల 5వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను బలహీనపరుస్తోందని ఆయన విమర్శించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మికుల హక్కులు దెబ్బతిన్నాయని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో కార్మికులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలు నివారించాలి

**ప్రజావాణిలో సీపీఐ(ఎం) వినతిపత్రం.**

కారేపల్లి, మహా: సింగరేణి మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నివారించాలని సీపీఐ (ఎం) మండల కమిటీ సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించింది. వర్షాలు లేక రైతులు మోటార్లతో పంటలను కాపాడుకునే పరిస్థితిలో విద్యుత్ కోతలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని నాయకులు తెలిపారు. ఉక్కపోత, దోమల సమస్యలతో పాటు గంటల తరబడి కరెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. సింగరేణి మండలంలో ఖాళీగా ఉన్న లైన్‌మన్ పోస్టులను వెంటనే భర్తీ చేసి,



నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 11వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి స్పందన కరువు**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్‌నగర్ పరిధిలోని సర్వే నంబర్ 151లో 60 గజాల స్థలాల కేటాయింపును కోరుతూ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 11వ రోజుకు చేరుకుంది. ఎండ, వర్షాలను లెక్కచేయకుండా మహిళలు, వృద్ధులు, యువకులు దీక్షలో పాల్గొంటూ తమ న్యాయమైన హక్కు కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అయితే, ఇన్ని రోజులు గడిచినా సంబంధిత అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ స్పందించకపోవడంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ఇప్పటివరకు దీక్షా శిబిరాన్ని సందర్శించకపోవడం, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకుని, 60 గజాల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



## గ్యాస్ బండపై అదనపు వసూళ్ళు

- వాహనాన్ని అడ్డుకున్న వెంకిట్యాతండా గ్రామస్తులు

**కారేపల్లి, మహా:** గ్యాస్ ధరలు పెరిగి అవస్థలు పడుతున్న వినియోగదారులకు గ్యాస్ ఏజెన్సీలు అక్రమంగా అదనపు వసూళ్లకు పాల్పడుతుండటంపై గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేస్తూ వాహనాన్ని అడ్డుకున్న ఘటన కారేపల్లి మండలం వెంకిట్యాతండాలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్యాస్ ను ఆన్ లైన్ లో బుక్ చేసుకుంటే రూ.965 దానికి డెలివరీ చార్జీలు రూ.20 మొత్తం రూ. 985 లకు గ్యాస్ సిలిండర్ డెలివరీ కావాలి. కాని కారేపల్లి మండలంలో వాహనాలలో డెలివరీ చేస్తున్న వ్యక్తులు మాత్రం రూ. 1100 డిమాండ్ చేసి తీసుకుంటున్నారని వినియోగదారులు అవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ బుకింగ్ చేయని వినియోగదారుల నుండి అదనంగా మరో రూ.100 తీసుకుంటూ దోచుకుంటున్నారని వారు అగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్యాస్ ను అధిక ధరకు అమ్మకం చేయటానికి




నిరసిస్తూ గ్యాస్ బండలతో వచ్చిన వాహనాన్ని గ్రామస్తులు అపీ వేసి నిరసన తెలిపారు. అధిక ధరల విషయాన్ని గ్రామస్తులు తహసీల్దార్, ఆర్ఐ, జీపీవోలకు తెల్పటం తో వారు గ్యాస్ వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు.

## శ్యాంప్రసాద్ ఆశయాలకు కృషి చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధన కోసం ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ సమగ్రత, జాతీయ ఐక్యత, దేశభక్తికి శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన చూపిన సిద్ధాంతాలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. దేశ సమగ్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, వివిధ మండలాల పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు వెంటనే ఇవ్వాలి

**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు అందజేయడంతో పాటు జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ తదితర పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి పరిపాలన అధికారి అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై రోజులైనా విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల స్థానంలో కొత్త




భవనాలు నిర్మించాలని, ఒకే ఉపాధ్యాయుడితో పాఠశాలలు నడపడం సరికాదని పేర్కొన్నారు.
అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయకుండా మరింత బలోపేతం చేయాలని, విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ



## వాసాలమర్రి గ్రామాన్ని రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జులై 6 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించి గ్రామంలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మార్నింగ్ వాక్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి, ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలు, సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతులపై అధికారులు, స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు వాసాలమర్రి గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని, వాసాల మర్రిని రాష్ట్రంలోనే రోల్డ్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు ఈ నెలలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమం నేపథ్యంలో వాసాలమర్రి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే విధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాసాలమర్రి గ్రామంలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే గ్రామంలోని అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి, ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక సదుపాయం అందుబాటులో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సూచించారు. కార్యక్రమంలో వాసాలమర్రి సర్పంచ్ తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభించిన మంత్రులు

**భువనగిరి జులై 6 మహా న్యూస్ :** ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం కార్యాలయం ను సోమవారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బోనగిరి పార్లమెంట్ సభ్యులు శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్ బల్మూరు వెంకట్ ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి బత్తుల లక్ష్మారెడ్డి కుంభం అనిల్ కుమార్ రెడ్డి బాలు నాయక్ తదితరులు హాజరై వేముల వీరేశం కు శుభాకాంక్షలు తెలియజేశారు

## అజ్మీర వీరన్న కుటుంబాన్ని పరామర్శించిన సేవాలాల్ సేన నాయకులు

**కారేపల్లి , మహా:** మండల పరిధిలోని భీక్య తండా గ్రామ నివాసి, జిల్లా నాయకులు అజ్మీర వీరన్న గారి తల్లి అజ్మీర ఈరి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుమారులు అజ్మీరా బిచ్చ నాయక్,సురేష్ లతో పాటు కుటుంబ సభ్యులను సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు భుక్యా నరసింహారావు, లకావత్ దేవేందర్ నాయక్, జిల్లా కన్వీనర్లు భుక్యా వినోద్ కుమార్, ఇస్లావత్ చందులాల్ నాయక్, గుగులోత్ మజిలాల్ నాయక్, జరుపల ప్రసాద్, శంకర్, చరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు




## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఆలేరు ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జులై 6 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 261 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకంలోనూ ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని, మధ్యవర్తులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ



సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హుడికి చేరవేయడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని బీర్ల అయిలయ్య గారు. తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం అనేక కుటుంబాలకు క్లిష్ట సమయంలో గొప్ప ఊరటనిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజపాలనలో ప్రజల సమస్యలు పాలకులకు, అధికారులకు పట్టవా...

**బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్.**

**రాజేంద్రనగర్ మహా;** బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ సోమవారం కాటేదాన్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. బస్తీలలో సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. ప్రజా పాలన పేరుతో సమస్యలను పరిష్కరిస్తాము అని గొప్పలు చెప్పుకునే ప్రజా ప్రతినిధులు, ప్రజల సమస్యలను గాలికి వదిలేశాయన్నారు. కాటేదాన్ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్, బాబు రెడ్డి నగర్, శ్రీరాంనగర్, నేతాజీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఉన్న సమస్య అక్కడే ఉన్నాయి. సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గత 20 సంవత్సరాల క్రితం వేసినవే తప్ప, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బస్తీలపై చిన్నచూపు చూస్తూ వాటి మరమ్మతులకు కూడా నిధులు కేటాయించలేరని ఆరోపించారు. పాలకులు ఎన్నికలు వచ్చాయంటే చాలు బస్తీలకు వచ్చి ప్రజల్లోకనబడతారు. తప్ప సమస్యలు పరిష్కారానికి కృషి చెయ్యరని బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజా పాలనలో ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాటేదాన్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నల్గురికి రిమాండ్

**కారేపల్లి, మహా:** కారేపల్లిలోని ఓ గురుకులంలో ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన నలుగురిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై బైరు గోపి తెలిపారు. నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈనెల 4వ తేదిన గురుకులంలో సిబ్బందికి బాలిక బంధువులమని నమ్మ బలికి బాలికకు మాయమాటలు చెప్పి బయటకు వెళ్ళటానికి నింధుతులు గంట పర్మిషన్ తీసుకున్నారు. పర్మిషన్ తో గురుకులం నుండి తీసుకెళ్ళిన బాలిక ఎంతకు గురుకులంకు రాక పోవటంతో సిబ్బంది ద్వారా తెలుసుకున్న కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ దుర్గాభవాని పోలీసులకు పిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సెల్ ఫోన్ ఆధారంగా నింధుతులను పట్టుకున్నారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో నివాసముండే నిందితుడికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను పోక్సో, బాలిక కిడ్నాఫ్ కేసులో అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

# మల్టీక్యాప్ ఫండ్లకు పెరుగుతున్న ఆదరణ

- లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్‌లలో సమతుల పెట్టుబడులతో మెరుగైన అవకాశాలు.
- విస్తృతంగా ర్యాలీ కొనసాగుతుండటంతో మల్టీక్యాప్ ఫండ్లకు అనుకూల పరిస్థితులు.
- దీర్ఘకాలిక సంపద సృష్టికి మంచి ఎంపికగా సూచిస్తున్న నిపుణులు

**ముంబై, మహా:** భారతీయ స్టాక్ మార్కెట్‌లో ఇటీవలి కాలంలో నమోదవుతున్న ర్యాలీ కేవలం లార్జ్‌క్యాప్ కంపెనీలకే పరిమితం కాకుండా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీలకూ విస్తరించడంతో మల్టీక్యాప్ మ్యూచువల్ ఫండ్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈక్విటీ మార్కెట్‌లోని అన్ని విభాగాల్లో సమతుల్య పెట్టుబడులు పెట్టే మల్టీక్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులకు దీర్ఘకాలంలో మెరుగైన లాభాలను అందించే అవకాశముందని యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ తాజా నివేదిక వెల్లడించింది.

గత కొన్ని నెలలుగా మార్కెట్‌లో లాభాలు కొద్ది పెద్ద కంపెనీలకే పరిమితం కాకుండా పలు రంగాలకు చెందిన మధ్య, చిన్న కంపెనీల షేర్లకు కూడా విస్తరించాయి. తయారీ, మౌలిక వసతులు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, వినియోగ వస్తువులు, సాంకేతిక రంగాల్లోని కంపెనీలు కూడా మంచి ప్రదర్శన కనబరుస్తుండటంతో మార్కెట్ ర్యాలీ మరింత విస్తృతమైంది. ఈ పరిస్థితి మల్టీక్యాప్ ఫండ్ల పనితీరుకు బలాన్నిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

నిబంధనల ప్రకారం మల్టీక్యాప్ ఫండ్లు లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో కనీస పెట్టుబడులు కొనసాగించాల్సి ఉంటుంది. దీంతో ఒకే ఫండ్ ద్వారా మూడు విభాగాల వృద్ధి అవకాశాలను పెట్టుబడిదారులు పొందగలుగుతారు. మార్కెట్‌లో ఒడిదొడుకులు వచ్చినప్పుడు లార్జ్‌క్యాప్ షేర్లు స్థిరత్వాన్ని అందిస్తే, అనుకూల పరిస్థితుల్లో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీలు అధిక వృద్ధి అవకాశాలను కల్పిస్తాయి. ఈ రెండు ప్రయోజనాలను ఒకేసారి అందించే వ్యూహమే మల్టీక్యాప్ ఫండ్ల ప్రత్యేకతగా విశ్లేషకులు చెబుతున్నారు.

ఏ సమయంలో ఏ విభాగం మెరుగ్గా రాణిస్తుందో ముందుగానే అంచనా వేయడం చాలా కష్టమని నిపుణులు సూచిస్తున్నారు. తరచూ పెట్టుబడుల కేటాయింపును మార్చడం కంటే, అన్ని మార్కెట్ విభాగాల్లో సమతుల్యంగా పెట్టుబడులు పెట్టే మల్టీక్యాప్ ఫండ్లలో కొనసాగడం మెరుగైన వ్యూహమని అభిప్రాయపడుతున్నారు. ఈ విధానం వల్ల మార్కెట్ టైమింగ్‌పై ఆందోళన తగ్గడంతో పాటు కొత్త అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది.

మల్టీక్యాప్ ఫండ్ల మరో ప్రధాన ప్రయోజనం వైవిధ్యీకరణ (డైవర్సిఫికేషన్). వివిధ పరిమాణాల కంపెనీల్లో పెట్టుబడులు విస్తరించడం వల్ల ఒక విభాగం బలహీనంగా ఉన్నా, మరో విభాగం లాభాలు మొత్తం పోర్ట్‌ఫోలియోకు మద్దతుగా నిలుస్తాయి. దీంతో రిస్క్ తగ్గడంతో పాటు దీర్ఘకాలికంగా స్థిరమైన రాబడులు పొందే అవకాశం ఉంటుంది.

అయితే పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడి కాలవ్యవధిని పరిగణనలోకి తీసుకుని మాత్రమే మల్టీక్యాప్ ఫండ్లను ఎంచుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు అధిక రాబడులు ఇచ్చే అవకాశమున్నప్పటికీ, మార్కెట్ పతనాల సమయంలో వీటిలో ఒడిదొడుకులు కూడా ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధి పథంలో కొనసాగుతున్న నేపథ్యంలో మల్టీక్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులకు సమతుల్య ఈక్విటీ పెట్టుబడి మార్గంగా నిలుస్తున్నాయి. విభిన్న మార్కెట్ విభాగాల్లో పెట్టుబడులు, ప్రొఫెషనల్ ఫండ్ మేనేజ్‌మెంట్, దీర్ఘకాలిక మూలధన వృద్ధి అవకాశాలు కలగలిపి మల్టీక్యాప్ ఫండ్లను పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన ఎంపికగా మారుస్తున్నాయని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# నాలుగో రోజూ జోరుమీద మార్కెట్లు



**ముంబై, మహా:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) నిరంతర పెట్టుబడులు, దేశీయ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న విశ్వాసం మార్కెట్లకు బలాన్నిచ్చాయి. దీంతో రోజు పొడవునా కొనుగోళ్ల జోరు కొనసాగి కీలక సూచీలు కొత్త ఉత్సాహాన్ని ప్రదర్శించాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 521.16 పాయింట్లు లేదా 0.67 శాతం లాభపడి 78,285.07 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 159.50 పాయింట్లు లేదా 0.66 శాతం పెరిగి 24,430.35 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే కొనుగోళ్ల ఒత్తిడి కనిపించడంతో సూచీలు రోజంతా గ్రీన్‌లోనే కొనసాగాయి.

పెద్ద కంపెనీలతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ మంచి కొనుగోళ్లు నమోదయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ సుమారు 0.4 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ దాదాపు 0.7 శాతం లాభపడింది. మార్కెట్ విస్తృతి కూడా సానుకూలంగానే ఉండగా, లాభాల్లో ముగిసిన షేర్ల సంఖ్య నష్టాల్లో ముగిసిన వాటికంటే ఎక్కువగా నమోదైంది.

ఈ రోజు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలే మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల షేర్లలో భారీ కొనుగోళ్లు చోటుచేసుకున్నాయి. నిర్మాణ, వినియోగ సేవలు, ఆటోమొబైల్, క్యాపిటల్ గూడ్స్, మౌలిక వసతులు, రియాల్టీ, ఇండస్ట్రియల్ రంగాల షేర్లు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి. దేశీయ ఆర్థికాభివృద్ధిపై పెట్టుబడిదారుల్లో పెరుగుతున్న నమ్మకం ఈ రంగాలకు మద్దతుగా నిలిచింది.

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లపై ఉన్న అనిశ్చితి తగ్గడం, దేశీయ ఆర్థిక సూచీలు మెరుగుపడటం మార్కెట్లకు ఊతమిచ్చాయి. ఈ ఏడాది రుతుపవనాలు అనుకూలంగా ఉండే అవకాశాలు, కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలపై ఆశావహ అంచనాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం కూడా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్న అంశాలుగా పేర్కొంటున్నారు.

దేశీయ వినియోగం బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, రిజర్వ్ బ్యాంక్ సమతుల్య ద్రవ్య విధానాన్ని కొనసాగించే అవకాశాలు కూడా మార్కెట్‌కు సానుకూల సంకేతాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ మౌలిక అంశాలు బలంగా ఉండటంతో పెట్టుబడిదారులు భారత మార్కెట్లపై విశ్వాసం కొనసాగిస్తున్నారని చెబుతున్నారు.

అయితే వరుసగా నాలుగు రోజుల లాభాల అనంతరం కొంత మేర ప్రాఫిట్ బుకింగ్ జరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేగంగా పెరిగిన షేర్లను వెంటాడకుండా, బలమైన మౌలిక అంశాలు ఉన్న కంపెనీల్లోనే పెట్టుబడులు పెట్టాలని సూచిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న కార్పొరేట్ ఫలితాల సీజన్, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ కేంద్ర బ్యాంకుల విధాన నిర్ణయాలు, ముడి చమురు ధరల కదలికలు, రుతుపవనాల పురోగతి వంటి అంశాలు రానున్న రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

స్వల్పకాలిక ఒడిదొడుకులు ఎదురైనా, దీర్ఘకాలికంగా భారతీయ ఈక్విటీ మార్కెట్లపై ఆశావహ దృక్పథం కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. దేశీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం, పెట్టుబడులు పెరగడం, కార్పొరేట్ రంగం మెరుగైన పనితీరు కనబరిస్తే మార్కెట్లు మరింత ఎగబాకే అవకాశాలు ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు.



# షార్ట్ సెల్లింగ్‌కు సెబీ ప్రోత్సాహం

**ముంబై, మహా:** భారతీయ స్టాక్ మార్కెట్‌లో క్యాష్ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసేందుకు భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. షార్ట్ సెల్లింగ్‌ను సులభతరం చేయడంతో పాటు సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ స్కీమ్ (ఎస్ఎల్‌బీఎస్) పరిధిలోకి మరిన్ని షేర్లను తీసుకురావాలని సెబీ పరిశీలిస్తోంది. ఈ చర్యల ద్వారా మార్కెట్‌లో లిక్విడిటీ పెరగడంతో పాటు పెట్టుబడిదారుల భాగస్వామ్యం కూడా పెరుగుతుందని భావిస్తోంది.

ప్రస్తుతం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సుమారు 2,600 కంపెనీలు లిస్టింగ్‌లో ఉన్నప్పటికీ, ఎస్ఎల్‌బీఎస్ కింద కేవలం 176 షేర్లలో మాత్రమే షార్ట్ సెల్లింగ్‌కు అవకాశం ఉంది. అర్హత నిబంధనలను సడలించడం ద్వారా ఈ సంఖ్యను దాదాపు రెట్టింపు చేయాలని సెబీ యోచిస్తోంది. దీంతో మరిన్ని షేర్లలో షార్ట్ సెల్లింగ్ లావాదేవీలు నిర్వహించే అవకాశం కలగనుంది.ఇదే సమయంలో తాకట్టు (కొలేటరల్) నిబంధనలను కూడా సెబీ సమీక్షిస్తోంది. ప్రస్తుతం షేర్లు అరువు తీసుకునే పెట్టుబడిదారులు వాటి విలువలో సుమారు 130 శాతం వరకు కొలేటరల్ సమర్పించాల్సి వస్తోంది. దీనిని అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన మార్కెట్ల తరహాలో 100 శాతం పరిధికి తగ్గించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల షార్ట్ సెల్లింగ్ ఖర్చు తగ్గి, మరింత మంది పెట్టుబడిదారులు ఈ విధానాన్ని వినియోగించే అవకాశం ఉంటుంది.ఇటీవలి కాలంలో డెరివేటివ్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తుండగా, క్యాష్ మార్కెట్‌లో లావాదేవీలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదనే ఆందోళనను సెబీ పలుమార్లు వ్యక్తం చేసింది. ముఖ్యంగా అధిక ఊహాగానాలు, లీవరేజ్ కారణంగా రిటైల్ పెట్టుబడిదారులు డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో నష్టాలను చవిచూస్తున్న నేపథ్యంలో క్యాష్ మార్కెట్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నియంత్రణ సంస్థ భావిస్తోంది.

# ఏఐ ప్రభావం.. మరోసారి మైక్రోసాఫ్ట్ లేఆఫ్స్

న్యూయార్క్, మహా: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో ప్రపంచ టెక్ రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా మరోసారి భారీ స్థాయిలో లేఆఫ్స్ ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో సుమారు 2.1 శాతం మేరకు, దాదాపు 4,800 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు వెల్లడించింది.

ఏఐ మౌలిక సదుపాయాల అభివృద్ధికి బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ఖర్చులను నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఏఐ రంగంలో ప్రపంచ టెక్ కంపెనీలు కలిపి 700 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయని అంచనా. మైక్రోసాఫ్ట్‌తో పాటు అమెజాన్, మెటా, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఏఐ విస్తరణపై భారీగా ఖర్చు చేస్తున్నాయి.2026 తొలి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేరు విలువ సుమారు 23 శాతం తగ్గడం కూడా కంపెనీపై ఒత్తిడిని పెంచినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. 2022 తర్వాత కంపెనీకి ఇదే అత్యంత బలహీనమైన తొలి అర్ధవార్షిక పనితీరు.



ఇప్పటికే ఈ ఏడాది ప్రారంభంలో అమెరికాలోని సుమారు 9 వేల మంది ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకాన్ని ప్రకటించిన మైక్రోసాఫ్ట్, ఇప్పుడు మరోసారి ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టడం టెక్ రంగంలో ఆందోళన కలిగిస్తోంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# భారత్‌కు జపాన్ టెక్నాలజీ..

- నౌకా దళానికి కొత్త బలం
- స్టెల్త్ సామర్థ్యం పెంచే ఇంటిగ్రేటెడ్ మాస్ట్
- భారత్-జపాన్ రక్షణ సహకారంలో కీలక అడుగు



**ఇంటర్నెట్ డెస్క్, మహా** : భారత్ - జపాన్ దేశాలు రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు వేసాయి. జపాన్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ కాంప్లెక్స్ రేడియో అంటెన్నా (యూనికార్న్) సిస్టమ్ ఆధారంగా నౌకాదళ రేడియో యాంటెన్నాను సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం జపాన్ ప్రధాని సానయే తకైచి భారత పర్యటన సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. ఇది భారత్‌జపాన్ మధ్య జరిగిన తొలి ప్రత్యక్ష సంయుక్త రక్షణ అభివృద్ధి ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ రెండు దేశాల రక్షణ సాంకేతిక సహకారానికి కొత్త దశను ప్రారంభిస్తుందని చెప్పారు. సముద్ర భద్రత, ప్రాంతీయ శాంతి, నియమ ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ బలోపేతం కోసం ఈ ప్రాజెక్ట్ కీలకంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఇప్పటివరకు భారత్‌జపాన్ రక్షణ సహకారం ప్రధానంగా సంయుక్త సైనిక విన్యాసాలు, చర్చల వరకు మాత్రమే పరిమితమైంది. అయితే ఈ ఒప్పందంతో ఆ పరిధి దాటి ప్రత్యక్ష సాంకేతిక అభివృద్ధి దిశగా అడుగు పడింది.

**యూనికార్న్ సిస్టమ్ ప్రత్యేకతలు**

యూనికార్న్ సిస్టమ్ ప్రస్తుతం జపాన్ మెరైన్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్‌కు చెందిన మోగామి క్లాస్ ఫ్రిగేట్స్ లో ఉపయోగంలో ఉంది. ఇది అధునాతన నౌకాదళ కమ్యూనికేషన్ వ్యవస్థగా గుర్తింపు పొందింది. భారత నౌకాదళం కూడా భవిష్యత్తులో నిర్మించబోయే కొత్త తరం యుద్ధ నౌకల్లో ఈ టెక్నాలజీ ఆధారిత యాంటెన్నాను ఉపయోగించే అవకాశం ఉంది. భారత్‌జపాన్ మధ్య 2022 నుంచి ఈ సాంకేతికతపై చర్చలు కొనసాగుతున్నాయి. 2024లో ఇరు దేశాల విదేశాంగ, రక్షణ మంత్రులు ఈ ప్రాజెక్ట్ పురోగతిని ప్రశంసించారు. అలాగే డ్రోన్‌లు, అన్‌మ్యాన్డ్ వాహనాల కోసం ఆధునిక టెక్నాలజీలపై కూడా సంయుక్త పరిశోధనలు జరుగుతున్నాయి. మజగాన్ డాక్ (ఎండీఎల్) కూడా 2025లో భారత్-జపాన్ సంయుక్త డిస్ట్రాయర్ డిజైన్‌పై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ ఒప్పందంతో భారత్-జపాన్ రక్షణ భాగస్వామ్యం మరింత బలపడనుంది. సముద్ర భద్రత రంగంలో ఆధునిక సాంకేతికత అభివృద్ధికి ఇది ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ఆధునిక నౌకాదళ యుద్ధ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా జపాన్ అభివృద్ధి చేసిన యూనికార్న్ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగం దృష్టిని ఆకర్షిస్తోంది. వివిధ రకాల కమ్యూనికేషన్, నావిగేషన్, డేటా లింక్ యాంటెన్నాలను ఒకే మాస్ట్‌లో ఏకీకృతం చేయడం ఈ సాంకేతికత ప్రత్యేకత. సాంప్రదాయంగా యుద్ధ నౌకలపై అనేక యాంటెన్నాలు వేర్వేరుగా అమర్చబడతాయి. దీంతో నౌక రాడార్‌లో సులభంగా గుర్తించబడే అవకాశం ఉంటుంది. అయితే యూనికార్న్ వ్యవస్థలో అన్ని కీలక యాంటెన్నాలను ఒకే నిర్మాణంలో సమీకరించడం ద్వారా నౌక రాడార్ సిగ్నేచర్‌ను తగ్గించి స్టెల్త్ సామర్థ్యాన్ని పెంచుతుంది. దీంతో శత్రు రాడార్లకు నౌకను గుర్తించడం మరింత కష్టమవుతుంది.

యూనికార్న్ వ్యవస్థ వల్ల నౌకపై బయటకు కనిపించే యాంటెన్నాల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో నౌక ఆకృతి మరింత సొగసుగా మారడమే కాకుండా, శత్రు రాడార్ల నుంచి గుర్తించే అవకాశాలు కూడా తగ్గుతాయి. అదే సమయంలో కమ్యూనికేషన్, నావిగేషన్, డేటా మార్పిడి, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వంటి అన్ని కీలక వ్యవస్థలు ఒకే మాస్ట్ ద్వారా సమర్థవంతంగా పనిచేస్తాయి.

# ఇండోనేషియా పర్యటనతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత బలం

**ఇంటర్నెట్ డెస్క్, మహా :** భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో చేపట్టున్న ఇండోనేషియా పర్యటనతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం, డిజిటల్ భాగస్వామ్యం, ఆర్థిక సంబంధాలకు మరింత ఊతం లభించనుందని భారతదేశంలోని ఇండోనేషియా రాయబారి ఇనా హాగ్నినింగ్త్యాస్ కృష్ణమూర్తి తెలిపారు. న్యూఢిల్లీ-జకార్తా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా ఈ పర్యటనను భావిస్తున్నారు.

రక్షణ తయారీ, సముద్ర భద్రత, డిజిటల్ సాంకేతికత, వాణిజ్యం వంటి కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని రాయబారి పేర్కొన్నారు. ఈ పర్యటన సందర్భంగా పలు కీలక ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్-ఇండోనేషియా సంబంధాల వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని అవి ప్రతిబింబిస్తాయని తెలిపారు.ఈ పర్యటనలో రక్షణ సహకారం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సంయుక్త సైనిక విన్యాసాల విస్తరణ, నౌకాదళాల మధ్య సహకారం బలోపేతం, రక్షణ ఉత్పత్తుల తయారీలో భాగస్వామ్యాన్ని పెంచే అవకాశాలపై ఇరు దేశాలు చర్చిస్తున్నాయి. కీలక సముద్ర మార్గాల వెంట ఉన్న వ్యూహాత్మక స్థానాల కారణంగా సముద్ర భద్రత అంశానికీ ప్రత్యేక ప్రాధాన్యం లభించనుంది.

డిజిటల్ సాంకేతిక రంగంలోనూ సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయి. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సైబర్ భద్రత వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. భారత్ విజయవంతంగా అమలు చేస్తున్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, ప్రజా డిజిటల్ వేదికలపై ఇండోనేషియా ఆసక్తి చూపుతోంది. భవిష్యత్ భాగస్వామ్యానికి



ఇవి ఆదర్శ నమూనాలుగా నిలవొచ్చని భావిస్తున్నారు. వాణిజ్యం, పెట్టుబడులకు కూడా ఈ పర్యటనలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, తయారీ రంగం, కీలక ఖనిజాలు వంటి విభాగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. బలమైన ఆర్థిక సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని అధికారులు భావిస్తున్నారు.భారత్-ఇండోనేషియా మధ్య ఉన్న సాంస్కృతిక, చారిత్రక బంధాలను కూడా ఈ పర్యటన మరోసారి చాటనుంది. విద్య, పర్యాటకం, ప్రజల మధ్య పరస్పర సంబంధాల ద్వారా ఇరు దేశాల అనుబంధం మరింత బలపడుతుందని రాయబారి తెలిపారు.

ఈ పర్యటన ద్వారా 'యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాల బలోపేతానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేయనున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి కోసం ఇరు దేశాలు మరింత కీలక పాత్ర పోషించే దిశగా ఈ పర్యటన కొత్త కార్యక్రమాలకు, దీర్ఘకాలిక సహకారానికి మార్గం సుగమం చేయనుంది.

# కేజ్రీవాల్ వ్యాఖ్యలకు మోదీ కౌంటర్.. బీజేపీ–ఆప్ మధ్య మాటల యుద్ధం

సోమవారం బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను ఉద్దేశించి "మీరు ఎవరు?" అంటూ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగంగా నబిన్‌ను ప్రశంసించడం రాజకీయ చర్చకు దారితీసింది.రామాలయానికి సంబంధించిన ఆరోపణలపై నితిన్ నబిన్ చేసిన విమర్శలకు స్పందిస్తూ కేజ్రీవాల్ ఆయనను "మీరు ఎవరు?" అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిని అవమానించారని కేజ్రీవాల్‌పై మండిపడ్డారు.

ఈ వివాదంలో జోక్యం చేసుకున్న ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల్లో నితిన్ నబిన్ సాధారణ నేపథ్యాన్ని వివరించే పోస్టులను పంచుకున్నారు. విద్యార్థి దశలో స్నేహితులతో కలిసి నివసించడం, ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించడం, నిరాడంబర జీవనం గడపడం వంటి విషయాలను ప్రస్తావించారు. నబిన్ నిరాడంబరత, నిబద్ధత, అందరితో కలిసిపోయే స్వభావం ప్రతి బీజేపీ కార్యకర్తకు గర్వకారణమని మోదీ పేర్కొన్నారు.

దీనిపై స్పందించిన కేజ్రీవాల్, నితిన్ నబిన్‌ను ప్రజలకు పరిచయం చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే వెంటనే రామాలయానికి సంబంధించిన నిధులు, భూముల వ్యవహారాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై దృష్టి సారించారు. ఆ ఆరోపణలకు బాధ్యులపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మరోసారి డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ వ్యాఖ్యలకు బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో ప్రతిస్పందించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆయన వ్యాఖ్యలను అహంకారపూరితంగా అభివర్ణించగా, ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ కూడా సామాజిక మాధ్యమాల వేదికగా కేజ్రీవాల్‌ను ఎద్దేవా చేశారు. దీంతో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది.

రానున్న ఎన్నికల నేపథ్యంలో బీజేపీ-ఆప్ మధ్య రాజకీయ పోరు మరింత ఉధృతమవుతున్న వేళ ఈ తాజా వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీ నితిన్ నబిన్‌ను సాధారణ కుటుంబం నుంచి ఎదిగిన, క్షేత్రస్థాయి నాయకుడిగా ప్రజల్లో నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, ఆప్ మాత్రం రామాలయానికి సంబంధించిన ఆరోపణలపై విచారణ, చర్యల డిమాండ్‌ను కొనసాగిస్తోంది. దీంతో ఇరు పార్టీల మధ్య రాజకీయ వాగ్వాదం మరింత తీవ్రమవుతోంది.



# మోహన్‌లాల్ ఏనుగు దంతాల కేసు.. కొత్త మలుపు తిరిగిన వివాదం

మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్‌కు సంబంధించిన ఏనుగు దంతాల (ఐవరీ) కేసు మరోసారి వార్తల్లో నిలిచింది. దశాబ్దానికి పైగా కొనసాగుతున్న ఈ న్యాయ వివాదంలో తాజాగా ఆయన ప్రభుత్వం ప్రకటించిన వైల్డ్‌లైఫ్ అమ్నెస్టీ పథకం కింద తన వద్ద ఉన్న ఐవరీ వస్తువుల వివరాలను అధికారికంగా వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. ఈ తాజా పరిణామం కేసు విచారణపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై న్యాయ, సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.మోహన్‌లాల్ సమర్పించిన వివరాల ప్రకారం, తన వద్ద మొత్తం 10 ఏనుగు దంతాలు తో పాటు వాటితో రూపొందించిన 13 ఐవరీ విగ్రహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో హిందూ దేవతల విగ్రహాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ వస్తువులన్నీ తనకు కుటుంబ వారసత్వంగా లేదా బహుమతుల రూపంలో లభించాయని ఆయన గతంలోనూ వివరణ ఇచ్చారు. అలాగే వన్యప్రాణి సంబంధిత చట్టాల ప్రకారం అవసరమైన అనుమతుల గురించి పూర్తి అవగాహన లేదని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టులో వాదిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ కేసులో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం ఐవరీ వస్తువుల ఉనికి కాదు, వాటి చట్టబద్ధమైన యాజమాన్యం. ఈ ఏనుగు దంతాలు ఎప్పుడు సేకరించబడ్డాయి? అవి చట్టబద్ధంగా పొందినవేనా? వాటికి సంబంధించిన యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అవసరమైతే ఐవరీ వస్తువులపై డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి వాటి మూలాన్ని నిర్ధారించే అవకాశాన్ని అటవీ శాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం.



ఈ వివాదం 2011లో ఆదాయపు పన్ను శాఖ మోహన్‌లాల్ నివాసంలో నిర్వహించిన సోదాల తర్వాత ప్రారంభమైంది. ఆ సమయంలో బయటపడిన ఏనుగు దంతాల ఆధారంగా అటవీ శాఖ కేసు నమోదు చేసింది. అనంతరం ప్రభుత్వం కొన్ని దశల్లో ఆయనకు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినప్పటికీ, ఆ ప్రక్రియపై న్యాయస్థానాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కేసు విచారణ కొనసాగించాలని కోర్టు స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న వైల్డ్‌లైఫ్ అమ్నెస్టీ పథకం కింద మోహన్‌లాల్ చేసిన స్వచ్ఛంద ఆస్తుల వెల్లడి ఆయనకు చట్టపరంగా ఎంతవరకు ఉపశమనం కలిగిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ పథకం ఉద్దేశం నమోదు కాని వన్యప్రాణి సంబంధిత వస్తువులను అధికారికంగా నమోదు చేయించడమే అయినప్పటికీ, ఇప్పటికే కోర్టు పరిధిలో ఉన్న కేసులపై దీని ప్రభావం ఎలా ఉంటుందనేది న్యాయస్థానం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.ఒక ప్రముఖ నటుడికి సంబంధించిన కేసు కావడంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే సమయంలో వన్యప్రాణి సంరక్షణ చట్టాల అమలు, వారసత్వంగా లభించిన ఐవరీ వస్తువుల చట్టబద్ధత, ప్రభుత్వ అమ్నెస్టీ పథకాల పరిధి వంటి కీలక అంశాలపై భవిష్యత్తులో మార్గనిర్దేశం చేసే కేసుగా ఇది నిలిచే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సముద్ర తీరంలో గ్లామర్ ట్రీట్



బాలీవుడ్ యువ కథానాయిక, జెన్‌జీ స్టార్ అనన్య పాండే మరోసారి తన స్టైలిష్ ఫొటోషూట్ తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సముద్ర తీరంలో సూర్యాస్తమయ వేళ నిర్వహించిన తాజా ఫొటోషూట్ లో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గోల్డెన్ అవర్ కాంతుల్లో మెరిసిపోయిన అనన్య ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. గ్లామర్, ఎలిగెన్స్, కాన్ఫిడెన్స్‌ను కలగలిపిన ఈ లుక్ మరోసారి ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా నిలబెట్టింది.ఈ ఫొటోషూట్ లో అనన్య పాండే బ్లాక్ కలర్ స్లీక్ బాడీసూట్‌ను ధరించి, దానికి ఆరెంజ్‌బ్లాక్ డిజైన్‌తో కూడిన స్టైలిష్ మినీ ర్యాప్ స్కర్ట్‌ను జత చేసింది. సముద్రపు గాలికి అలలల్లా ఎగిరే జుట్టు, సహజమైన చిరునవ్వు, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించే పోజులు ఆమె లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న సముద్రం, అస్తమిస్తున్న సూర్యుడి బంగారు కిరణాలు ఈ ఫొటోషూట్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఈ చిత్రాలను చూసిన అభిమానులు ఆమె స్టైల్‌ను ప్రశంసిస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.అనన్య పాండే 2019లో విడుదలైన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' చిత్రంతో బాలీవుడ్‌లో కథానాయికగా అడుగుపెట్టింది. టైగర్ ష్రాఫ్ సరసన నటించిన తొలి చిత్రంతోనే తన అందం, నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అనంతరం 'పతి పత్ని ఔర్ వో' 'ఖాలీ పీలీ' 'డ్రీమ్ గర్ల్ 2, అలాగే నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'కాల్ మీ బే' వంటి ప్రాజెక్టుల్లో విభిన్న పాత్రలు పోషించి నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా 'ఖో గయే హమ్ కహా' చిత్రంలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా అనన్య పాండేకు భారీ ఫాలోయింగ్ ఉంది. ఫ్యాషన్ ఫొటోషూట్లు, ట్రావెల్ డైరీలు, ఫిట్‌నెస్ అప్‌డేట్లు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటుంది. ప్రతి కొత్త లుక్‌తో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటూ యువతకు స్టైల్ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తోంది. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఆమె మంచి గుర్తింపు పొందింది.ప్రస్తుతం అనన్య పాండే చేతిలో పలు బాలీవుడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. కమర్షియల్ చిత్రాలతో పాటు కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. ఇక విజయ్ దేవరకొండ నటిస్తున్న 'రౌడీ జనార్ధన్' చిత్రంలో ఆమె ప్రత్యేక గీతంలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.తాజా సన్‌సెట్ ఫొటోషూట్ తో మరోసారి తన గ్లామర్, స్టైల్, ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్న అనన్య పాండే ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సినిమాలతో పాటు ఇలాంటి స్టైలిష్ ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తున్న ఆమె, రాబోయే ప్రాజెక్టులతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవాలని సిద్ధమవుతోంది.

ట్రెడిషనల్ లుక్‌లో

# పాయల్ షెనోయ్ మ్యాజిక్

దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి, మోడల్ పాయల్ రాధాకృష్ణ షెనోయ్ మరోసారి తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మెరూన్ రంగులో మెరిసే అత్యంత విలాసవంతమైన లెహంగా చోళీ ధరించిన పాయల్, రాజకుమారిలా కనిపిస్తూ సంప్రదాయ అందాలను ఆధునిక స్టైల్‌తో మేళవించింది. ఆమె ధరించిన లెహంగా చోళీపై సున్నితమైన బీడ్‌వర్క్, మెరిసే ఎంబెలిష్‌మెంట్స్, అందమైన ఫ్రింజ్ డిజైన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పారదర్శకమైన దుపట్టా ఆమె లుక్‌కు మరింత హుందాతనాన్ని జోడించింది. మెడలో విలువైన నెక్లెస్, చెవులకు సరిపోయే ఆభరణాలు, చేతులకు స్టైలిష్ యాక్సెసరీలు, అలలల్లాంటి జుట్టు, ఆకట్టుకునే మేకప్ కలిసి ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఒక చేతిని ముఖం వద్ద ఉంచి ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన పోజ్ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఫొటోలో కనిపించే అద్దం ప్రతిబింబం మొత్తం ఫ్రేమ్‌కు మరింత వైభవాన్ని, కళాత్మకతను తీసుకొచ్చింది. ఈ అందమైన చిత్రాలను సోషల్ మీడియాలో పంచుకుంటూ పాయల్ సరదాగా **"లిటిల్ రెడ్ రైడింగ్ హుడ్... పెద్దదై... చివరకు చీర కట్టుకోవాలని నిర్ణయించుకుంది!"** అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటోషూట్‌ను ప్రముఖ ఫొటోగ్రాఫర్ **స్టోరీస్ బై దీపు** అద్భుతంగా చిత్రీకరించారు. ఫొటోగ్రఫీ, లైటింగ్, ఫ్రేమింగ్, కాస్ట్యూమ్ కలర్ కాంబినేషన్ అన్నీ కలిపి ఈ ఫొటోలను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. పాయల్ రాధాకృష్ణ షెనోయ్ సినీ ప్రయాణాన్ని కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రారంభించింది. ప్రముఖ దర్శకుడు **పీ.ఎన్. సత్య** దర్శకత్వంలో తెరకెక్కిన **'బెంగళూరు అండర్‌వరల్డ్'** చిత్రంతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. తొలి చిత్రంతోనే తన నటన, అందం, ఆత్మవిశ్వాసంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకు వరుస అవకాశాలు రావడం ప్రారంభమైంది. కన్నడతో పాటు తెలుగు సహా ఇతర దక్షిణాది భాషల చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటుకుంటోంది. ప్రతి పాత్రలో కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం చేస్తూ నటిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటోంది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా సమానంగా ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. సినిమాలతో పాటు మోడలింగ్ రంగంలోనూ పాయల్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రముఖ డిజైనర్ల కోసం నిర్వహించే ఫ్యాషన్ షోలు, బ్రాండెడ్ ఫొటోషూట్లు, కమర్షియల్ ప్రచార కార్యక్రమాల్లో ఆమె తరచూ పాల్గొంటోంది. సోషల్ మీడియాలో కూడా ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఎప్పటికప్పుడు కొత్త ఫొటోషూట్లు, ఫ్యాషన్ ట్రెండ్స్, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ప్రాంతీయ చిత్ర పరిశ్రమలో వేగంగా ఎదుగుతున్న యువ నటీమణుల్లో పాయల్ రాధాకృష్ణ షెనోయ్ ఒకరిగా గుర్తింపు పొందుతోంది. సంప్రదాయ దుస్తుల్లోనూ, ఆధునిక ఫ్యాషన్‌లోనూ సమానంగా మెప్పించే ఆమె స్టైల్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ తాజా మెరూన్ లెహంగా ఫొటోషూట్ కూడా ఆమె స్టైల్, అభిరుచి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. పండుగలు, ప్రత్యేక వేడుకలు, రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ఇలాంటి లుక్ అద్భుతంగా సరిపోతుందని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అందం, అభినయం, ఫ్యాషన్ సెన్స్, ఆత్మవిశ్వాసం అనే నాలుగు అంశాలను సమపాళ్లలో కలబోసుకుంటూ పాయల్ రాధాకృష్ణ షెనోయ్ తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే సామర్థ్యం ఉన్న యువ కథానాయికగా ఆమెపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



# 'కింగ్100'లో టబు విలన్‌గా?



నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం 'కింగ్100'పై ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జునతో సూపర్‌హిట్ చిత్రాల్లో నటించిన టబు, ఈ సినిమాలో హీరోయిన్‌గా కాకుండా నెగటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

ఇటీవల అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, జూలై 10 తర్వాత 'కింగ్100'కు సంబంధించిన అప్‌డేట్ ఇస్తానని ప్రకటించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు రా కార్తీక్ రూపొందిస్తున్న ఈ చిత్రం పేదరికం నుంచి విజయవంతమైన వ్యక్తిగా ఎదిగిన ఓ వ్యక్తి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. తండ్రీకూతుళ్ల మధ్య సాగే భావోద్వేగాలు కథలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ప్రచారం జరుగుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సుష్మిత భట్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు.ప్రస్తుతం టబు పాత్రకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నప్పటికీ, అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. నాగార్జున 100వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో మాత్రం భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రాజ్ బి శెట్టి ఎంట్రీతో సియోన్ పై పెరిగిన క్రేజ్




శివకార్తికేయన్ కథానాయకుడిగా రూపొందుతున్న తాజా చిత్రం 'సియోన్' మరోసారి సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొనగా, ఇప్పుడు ప్రముఖ కన్నడ నటుడు, దర్శకుడు రాజ్ బి శెట్టి ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అంతేకాదు, కోలీవుడ్‌లో రాజ్ బి శెట్టికి ఇదే తొలి సినిమా కావడం ఈ అప్‌డేట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.ఇటీవలి కాలంలో దక్షిణాది సినీ పరిశ్రమల మధ్య ఉన్న భాషా సరిహద్దులు క్రమంగా చెరిగిపోతున్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమలకు చెందిన నటీనటులు పరస్పరం ఒకరి సినిమాల్లో మరొకరు నటిస్తూ పాన్‌సౌత్ మార్కెట్‌ను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. అదే వ్యూహాన్ని అనుసరిస్తూ 'సియోన్' చిత్ర బృందం కూడా వివిధ భాషల్లో గుర్తింపు పొందిన నటులను ఎంపిక చేస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా దక్షిణాది ప్రేక్షకులందరినీ ఆకట్టుకునేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. శివకార్తికేయన్ కెరీర్ పరంగా కూడా 'సియోన్'కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. గత చిత్రాల ఫలితాల తర్వాత బాక్సాఫీస్ వద్ద బలమైన విజయాన్ని అందుకోవాల్సిన పరిస్థితి ఆయనకు ఉంది. అలాంటి సమయంలో గ్రామీణ నేపథ్యం, స్థానిక భావోద్వేగాలతో కూడిన కథను ఎంపిక చేసుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. గతంలో ఇలాంటి కథలతో ఆయన సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటున్న అభిమానులు, 'సియోన్' కూడా అదే స్థాయిలో విజయాన్ని అందిస్తుందనే ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎక్కువ చర్చకు కారణమవుతున్న అంశం రాజ్ బి శెట్టి ఈ సినిమాలో నటించడమే. నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, సాధారణంగా కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలనే ఎంపిక చేస్తారనే పేరు సంపాదించుకున్నారు. అందువల్ల ఆయన ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో 'సియోన్' కథలో బలమైన అంశాలు ఉండొచ్చనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. అయితే చిత్ర కథపై ఇప్పటివరకు మేకర్స్ ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. సినిమా ప్రకటించినప్పటి నుంచి విడుదలవుతున్న ప్రతి అప్‌డేట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. నటీనటుల ఎంపిక నుంచి సాంకేతిక బృందం వరకు ప్రతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు రాజ్ బి శెట్టి చేరికతో ఈ ప్రాజెక్ట్‌పై చర్చలు మరింత ఊపందుకున్నాయి. బలమైన కథ, విభిన్న నటీనటుల కలయిక, పాన్‌సౌత్ స్థాయిలో రూపొందుతున్న క్యాస్టింగ్, అలాగే శివకార్తికేయన్ కెరీర్‌లో కీలక దశలో వస్తున్న సినిమా కావడంతో 'సియోన్' ఇప్పటికే అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఈ సినిమా అంచనాలను ఎంతవరకు అందుకుంటుందో అన్న ఆసక్తి ప్రేక్షకులతో పాటు సినీ, ట్రేడ్ వర్గాల్లోనూ నెలకొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com